# ప్రజా మారుతి
తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

ప్రచురణ : జగిత్యాల | సంపుటి : 07 | సంచిక : 19 | శనివారం | 12 - 09 - 2026 | పేజీలు : 04 | వెల రూ. 2




మూసీ ప్రాజెక్టుకు ఎన్జీటీలో ఎదురుదెబ్బ.. తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు

## రైతుల మోటార్లకు మీటర్లు పెట్టబోము

- ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- వ్యవసాయ మోటార్లకు ఎట్టిపరిస్థితుల్లోనూ మీటర్లు పెట్టబోమని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు
- 53 లక్షల గృహ వినియోగదారులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కోసం 5,000 కోట్లు చెల్లిస్తోందని భట్టి విక్రమార్క



**హైదరాబాద్ :**

రైతుల మోటర్లకు ఎట్టి పరిస్థితుల్లో మీటర్లు పెట్టబోమని, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టంచేశారు. శాసనమండలిలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. రాష్ట్రంలో విద్యుత్ సరఫరా వ్యవస్థను అప్‌గ్రేడ్ చేయడానికే కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ఆర్‌డీఎస్ఎస్ పథకాన్ని వినియోగించుకుంటామన్నారు. అందులో ఎక్కడా వ్యవసాయ మోటర్లకు మీటర్లకు పెట్టాలనే నిబంధన లేదని భట్టి విక్రమార్క తెలిపారు. అలాంటి భయాందోళన సృష్టించవద్దని ఆయన సూచించారు. థర్మల్‌తో పాటు సోలార్ విద్యుత్ ఉత్పత్తి పెంచుకుంటూ వెళ్లాల్సిన అవసరముందని భట్టి విక్రమార్క తెలిపారు.రాష్ట్రంలోని 29 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు ఉచిత విద్యుత్ అందించడానికి ప్రభుత్వం ఏటా రూ.14,000 కోట్లు, 53 లక్షల గృహ - మిగతా 2 లో

## కొండా సురేఖకు బుజ్జగింపులు


2 లో

- కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ ఫోన్
- మాజీ మంత్రి కొండా సురేఖకు ఫోన్ చేసిన మీనాక్షి నటరాజన్
- వ్యక్తిగత విభేదాలు పక్కనపెట్టి పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచన
- అసెంబ్లీ సమావేశాలకు సురేఖ గైర్హాజరు కావడంతో పార్టీలో చర్చ
- అధిష్టానం ఆదేశాలతోనే ఇన్‌ఛార్జ్ మాట్లాడినట్లు సమాచారం



## పురపాలక పాలనలో ట్రాన్స్‌జెండర్లు

- అసెంబ్లీలో కీలక బిల్లుకు ఆమోదం
- మున్సిపల్ కార్పొరేషన్లలో ట్రాన్స్‌జెండర్లకు కో-ఆప్షన్ సభ్యులుగా అవకాశం
- తెలంగాణ మున్సిపాలిటీల చట్ట సవరణ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం
- హైదరాబాద్ వెలుపల 9 కార్పొరేషన్లలో ఒక్కో ట్రాన్స్‌జెండర్‌కు ప్రాతినిధ్యం
- ప్రజా జీవితంలో భాగస్వామ్యం కల్పించడమే లక్ష్యమన్న ప్రభుత్వం

**హైదరాబాద్ :**

తెలంగాణ ప్రభుత్వం మరో చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లలో ట్రాన్స్‌జెండర్లకు కో-ఆప్షన్ సభ్యులుగా ప్రాతినిధ్యం కల్పించే బిల్లుకు శాసనసభ శుక్రవారం ఆమోదం - మిగతా 2 లో



## టోల్ ప్లాజాల వద్ద ఇక ఆగాల్సిన పనిలేదు

- ఫిబ్రవరి నుంచి కొత్త రూల్
- ఫిబ్రవరికి బారియర్ ఫ్రీ టోల్ విధానం
- ఫాస్టాగ్‌కు నంబర్‌ప్లేట్ గుర్తింపు జత
- టోల్ ఆదాయం ఏటా రూ.10 వేల కోట్లు పెరిగే అవకాశం ఉందన్న గడ్కరీ
- టోల్ ప్లాజాల వద్ద వాహనాలు ఆగాల్సిన అవసరం ఉండదని స్పష్టీకరణ

**ఢిల్లీ :**

హైవేలపై టోల్ చెల్లింపుల్లో కీలక మార్పు రానుంది. ఇక వాహనాలు టోల్ ప్లాజాల వద్ద ఆగాల్సిన అవసరం లేకుండా పూర్తిగా డిజిటల్ విధానాన్ని తీసుకురానున్నారు. వచ్చే ఫిబ్రవరిలోగా ఈ విధానం అందుబాటులోకి రానుందని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు.ముంబైలో - మిగతా 2 లో

## మోదీతో జిన్‌పింగ్ భేటీకి ముందు చైనా కీలక ప్రకటన

- విభేదాలను పరిష్కరించుకుంటామని స్పష్టీకరణ
- 2019 తర్వాత భారత్‌కు జిన్‌పింగ్ తొలిసారి రాక
- 2024లో గస్తీ ఒప్పందంతో కీలక పరిణామం
- వరుసగా మూడో ఏడాది మోదీజిన్‌పింగ్ భేటీ



**ఢిల్లీ :**

ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ భేటీకి ముందు బీజింగ్ కీలక వ్యాఖ్యలు చేసింది. భారత్, చైనా మధ్య ఉన్న విభేదాలను - మిగతా 2 లో

## స్టార్టప్‌ల కోసం భారత్‌లో ప్రపంచస్థాయి ఎకోసిస్టమ్

- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- బ్రిక్స్ దేశాలు దీన్ని వాడుకోవచ్చు
- బ్రిక్స్ బిజినెస్ ఫోరమ్ లీడర్స్ సెషన్‌లో మోదీ వ్యాఖ్యలు
- ప్రపంచవ్యాప్తంగా వాణిజ్యపర ఆంక్షలు పెరుగుతుంటే, భారత్ ఆర్థిక బంధాల్ని బలోపేతం చేస్తుందని స్పష్టం
- 40 దేశాలతో భారత్ ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్స్ చేసుకుందన్న ప్రధాని




**ఢిల్లీ :**

ప్రపంచవ్యాప్తంగా వాణిజ్య అడ్డంకులు పెరుగుతున్న సమయంలో భారత్ మాత్రం ఇతర దేశాలతో ఆర్థిక సంబంధాల్ని బలోపేతం చేసేలా ఆర్థిక వారధుల్ని (ఆర్థిక బంధాలు) నిర్మిస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. 2014 నుంచి ఇప్పటివరకు భారత్ సుమారుగా 40 దేశాలతో ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్స్ (ఫీూా- స్వేచ్ఛాయుత వాణిజ్య ఒప్పందాలు) కుదుర్చుకుందని - మిగతా 2 లో

## భారత్‌కు బ్రిక్స్ సవాల్
## రూ. 21.57 లక్షల కోట్లకు వాణిజ్య లోటు!

- బ్రిక్స్ దేశాలతో భారీగా పెరిగిన భారత వాణిజ్య లోటు
- 226 బిలియన్ డాలర్ల లోటుతో ఆందోళన
- పరిష్కారంపై భారత్ దృష్టి
- చైనా, రష్యాల నుంచే అధికంగా వాణిజ్య లోటు నమోదు
- భారత ఉత్పత్తులకు మార్కెట్ అవకాశాలు కల్పించాలని డిమాండ్
- ఫార్మా, ఆటోమొబైల్ రంగాల్లో అవకాశాలపై ప్రధానంగా చర్చ




**ఢిల్లీ :**

భారత్ ఆతిథ్యమిస్తున్న 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో కూటమితో దేశానికి నానాటికీ పెరుగుతున్న వాణిజ్య లోటు అంశం ప్రధానంగా చర్చకు వచ్చింది. బ్రిక్స్ దేశాలతో (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా) భారత్ వాణిజ్య లోటు 2025-26 ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో 226.1 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 21.57 - మిగతా 2 లో

## వినాయక చవితి సందర్భంగా 13 రోజుల పాటు ట్రాఫిక్ ఆంక్షలు

- వినాయక చవితి సందర్భంగా ఖైరతాబాద్‌లో ట్రాఫిక్ ఆంక్షలు
- సెప్టెంబర్ 12 నుంచి 24వ తేదీ వరకు ఆంక్షలు అమలు
- ప్రతిరోజు ఉదయం 11 గంటల నుంచి రాత్రి వరకు మళ్లింపులు
- భక్తుల వాహనాల కోసం ప్రత్యేక పార్కింగ్ స్థలాల ఏర్పాటు


2 లో..




## స్థానిక సంస్థల ఎన్నికలపై షర్మిల కీలక నిర్ణయం




- రఘువీరారెడ్డి చైర్మన్‌గా రాష్ట్ర స్థాయి మానిటరింగ్ కమిటీ ఏర్పాటు
- స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి సారించిన షర్మిల
- కమిటీలో రుద్రరాజు, పల్లంరాజు, కృపారాణి, తులసిరెడ్డి తదితర నేతలు
- గరిష్ఠ సంఖ్యలో స్థానాలను కైవసం చేసుకునేలా ప్రణాళికలు రచించాలని దిశానిర్దేశం

**అమరావతి :**

ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఉనికిని చాటుకోవడమే లక్ష్యంగా ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పక్కా వ్యూహంతో ముందుకు సాగుతున్నారు. స్థానిక పోరులో పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవడానికి - మిగతా 2 లో

## పాలనలో స్పీడ్ పెరగాల్సిందే

- ఫైళ్ల జాప్యంపై సీఎం చంద్రబాబు సీరియస్
- దస్త్రాల పరిష్కారంలో జాప్యంపై సీఎం చంద్రబాబు తీవ్ర ఆగ్రహం
- నెలరోజుల్లో ప్రభుత్వ ఫైళ్లన్నీ ఆన్‌లైన్‌లోనే నిర్వహించాలని ఆదేశం
- సమావేశానికి రాని అధికారులపై చర్యలు తీసుకోవాలని సీఎస్‌కు సూచన
- క్షేత్రస్థాయి పర్యటనలతో ప్రజా సమస్యలు తెలుసుకోవాలని దిశానిర్దేశం
- గ్రామ, వార్డు సిబ్బందికి జాబ్ ఛార్ట్




**అమరావతి :**

ప్రభుత్వ దస్త్రాల పరిష్కారంలో జాప్యాన్ని ఏమాత్రం సహించేది లేదని, పాలనలో వేగం పెంచాలని సీఎం చంద్రబాబు అధికారులను గట్టిగా హెచ్చరించారు. మంత్రులు, కార్యదర్శులు, కలెక్టర్లు ఫైళ్లను వీలైనంత వేగంగా క్లియర్ చేయాలని స్పష్టం చేశారు. అమరావతిలో జరిగిన 8వ జిల్లా కలెక్టర్ల సదస్సులో ఆయన పరిపాలనపై పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. సకాలంలో దస్త్రాలను పరిష్కరించకుండా జాప్యం చేస్తున్న కొందరు అధికారుల తీరుపై సీఎం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రోజుల్లోపు ఫైళ్లు క్లియర్ చేసిన వారిని అభినందిస్తూనే, గంటల వ్యవధిలోనే పూర్తి చేసిన వారిని ప్రత్యేకంగా ప్రశంసించారు.ఈ సమావేశానికి కొందరు ఉన్నతాధికారులు గైర్హాజరు కావడంపై ముఖ్యమంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వారి నుంచి వివరణ తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్‌ను ఆదేశించారు. పరిపాలనలో జవాబుదారీతనం ముఖ్యమని, ఐఏఎస్ అధికారుల పనితీరుపై 360 డిగ్రీల నివేదికను అందరి - మిగతా 2 లో

# సంపాదకీయం

## బ్రిటన్ కొత్త యుద్ధం!

వెస్ట్‌బ్యాంక్‌లోని ఇజ్రాయెల్ సెటిల్‌మెంట్లపై బ్రిటన్ వాణిజ్య నిషేధం విధించింది. ఇజ్రాయెల్ ఆక్రమిత ప్రాంతాలనుంచి వచ్చే అన్ని రకాల వస్తువుల దిగుమతులను నిషేధించడంతో పాటు, ఫైనాన్సింగ్, నిర్మాణ రంగాలకు సంబంధించిన లావాదేవీలేవీ వాటితో జరగబోవని బ్రిటన్ ప్రకటించింది. ఈ నిర్ణయానికి ఫ్రాన్స్, కెనడాలు మద్దతు ప్రకటిస్తూ, తాము కూడా ఈ నిషేధంలో భాగస్వాములవుతున్నట్లు ప్రకటించాయి. మరోపది చిన్నాచితకా దేశాలు కూడా చేయికలిపాయి. ఆండ్రీ బర్న్‌హమ్ ప్రధాని అయిన తరువాత ఇజ్రాయెల్ విషయంలో యునైటెడ్ కింగడమ్ విదేశాంగవిధానంలో వచ్చిన విశేషమైన మార్పుగా విశ్లేషకులు దీనిని అభివర్ణిస్తున్నారు. ఈ నిర్ణయాన్ని ప్రకటిస్తూ బ్రిటన్ విదేశాంగమంత్రి ఇజ్రాయెల్ మీద ఘాటైన వ్యాఖ్యలే చేశారు. వెస్ట్‌బ్యాంక్‌లో 'సెటిలర్ టెర్రరిస్టులు' పాలస్తీనాజాతి నిర్మూలనకు పాల్పడుతున్నారని, వారి ఇళ్ళను కూల్చివేస్తూ, మౌలికసదుపాయాలు ధ్వంసం చేస్తూ ఘోర అకృత్యాలకు ఒడిగడుతున్నారని, అంతర్జాతీయ సమాజం కళ్ళముందు జరుగుతున్న ఈ ఘాతుకాలకు తాము సిగ్గుపడుతున్నామని అన్నారాయన. వెస్ట్‌బ్యాంక్‌ను ఇజ్రాయెల్ తన అధీనంలోకి తెచ్చుకోవడాన్ని మొత్తంగా తప్పుబడుతూ, దానిని అంతర్జాతీయ నియమాలకు విరుద్ధంగా సాగిన దురాక్రమణగా అభివర్ణించారాయన. ఈ విధంగా నిర్వచించకపోతే అక్కడి ప్రజలు అనుభవిస్తున్న నరకాన్ని మనం గుర్తించనట్టు అవుతుందని, రేపటి న్యాయానికి ఈ గుర్తింపు ప్రాతిపదిక కావాలని అన్నారాయన. ఈ పరిణామాన్ని ఇజ్రాయెల్, అమెరికా గట్టిగా ఖండించాయి. బ్రిటన్‌కు వ్యతిరేకంగా కఠిన చర్యలకు ఉపక్రమించడానికి తాను సిద్ధంగా ఉన్నట్టు ఇజ్రాయెల్ ప్రకటించింది. యూదు ప్రజలపై బ్రిటన్ చూపుతున్న వివక్ష ఇది అంటూ, ప్రతిగా అమెరికానుంచి ప్రతీకార చర్యలు తప్పవని ఇజ్రాయెల్‌లోని అమెరికా రాయబారి సంకేతాలు ఇచ్చారు కూడా. ఆక్రమిత పాలస్తీనా భూభాగంలో ఇజ్రాయెల్ సెటిల్‌మెంట్లు ఇటీవలికాలంలో బాగా పెరగడంతోపాటు, మరిన్ని ఆవాసాలను స్థిరపరచే దిశగా ఇజ్రాయెల్ ప్రధాని బెంజమీన్ నెతన్యాహూ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నది. తూర్పు జెరూసలేంలో మరో పన్నెండువందల ఆవాసాలతో ఈస్ట్ 1 సెటిల్‌మెంట్ ప్రాజెక్టును విస్తరించేందుకు ఇజ్రాయెల్ అడుగులు వేస్తున్న తరుణంలో బ్రిటన్ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ విస్తరణ ద్వారా వెస్ట్‌బ్యాంక్‌ను ఉత్తర, దక్షిణభాగాలుగా చీల్చి, స్వతంత్ర పాలస్తీనా రాజ్యం ఆవిర్భావానికి మోకాలడ్డాలన్నది ఇజ్రాయెల్ ఆలోచన. ఈ కొత్త సెటిల్‌మెంట్‌తో రమల్లా, బెత్లహామ్, హెబ్రాన్ వంటి ప్రధాన పాలస్తీనా నగరాలతో ఆక్రమిత తూర్పు జెరూసలేమ్‌ను భౌగోళికంగా తెంపివేయడం ఆ పథకంలో భాగం. ఆగస్టులో నెతన్యాహూ ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని ప్రకటించగానే, స్వతంత్ర పాలస్తీనా దేశానికి భవిష్య రాజధానిగా అనుకుంటున్న ఈ పురాతన నగరాన్ని ఏకాకిని చేసే కుట్రపై పాలస్తీనియన్లు తీవ్ర ఆగ్రహాన్ని వెలిబుచ్చారు. తాము ప్రతిపాదిస్తున్న ద్విదేశ సిద్ధాంతానికి రేపటిరోజుల్లో ఉనికి లేకుండా చేసే కుట్రగా యూరోపియన్ దేశాలు ఈ పరిణామాన్ని ఖండించాయి. గాజాలో ఇజ్రాయెల్ మారణకాండ మీద నోరుమెదపని ఈ దేశాలు, తదనంతర కాలంలో పాలస్తీనా రాజ్యం గురించి మాట్లాడుతున్న సంగతి తెలిసిందే. పాలస్తీనాను గుర్తించే ప్రతీ దేశంలోనూ ఒక సెటిల్‌మెంట్ తయారుచేస్తాం జాగ్రత్త అని ఇజ్రాయెల్ మంత్రి ఒకరు హెచ్చరించారు కూడా. తమ ఈస్ట్ 1 ప్లాన్‌తో పిండదశలోనే పాలస్తీనా దేశాన్ని విచ్ఛిన్నం చేయబోతున్నామని ఇజ్రాయెల్ బహాటంగానే చెబుతోంది. బ్రిటన్ చర్యలు విశేష ప్రభావం చూపేవి కావన్న విమర్శలు లేకపోలేదు. ప్రధానంగా సెటిల్‌మెంట్లనుంచి జరిగే దిగుమతులనే నిషేధించడం, భవిష్యత్తులో సదరు ఆవాసాల నిర్మాణానికి దోహదపడే సర్వీసులకు మాత్రమే నిషేధాన్ని పరిమితం చేయడం, ఆ ప్రాంతాల్లో హింసను ప్రోత్సహించే వ్యక్తులు, వ్యవస్థలపై చర్యలకు సంకల్పించడం, దురాక్రమణలకు ప్రత్యక్షంగా ఉపకరించే ఆయుధాల ఎగుమతులపైనే నియంత్రణ చర్యలు ఉంటాయనడం పరిమిత ప్రభావం చూపేవే. ఈ ఆంక్షలను దాటించి వ్యవహారాలు నడపడం కూడా పెద్ద కష్టమేమీ కాకపోవచ్చు. రెండేళ్ళలో గాజాను సర్వనాశనం చేయడానికి అమెరికా ప్రత్యక్షంగా, యూరప్ పరోక్షంగా ఇజ్రాయెల్‌కు సహకరించాయి. గాజా మారణకాండ కొనసాగుతున్న కాలంలోనే వెస్ట్‌బ్యాంక్‌లో వందలాదిమంది పాలస్తీనియన్లను హతమార్చి, వేలాదిమందిని అక్కడనుంచి ఇజ్రాయెల్ తరిమికొట్టింది. వెస్ట్‌బ్యాంక్‌ను పూర్తిగా విలీనం చేసుకొనే దిశగా అడుగులు పడుతున్న తరుణంలో, అమెరికా అండదండలు దండిగా ఉన్న ఇజ్రాయెల్‌తో యూరప్ అట్టకత్తి యుద్ధాలు చేస్తోంది.

## ప్రజా సమస్యలు తీర్చండి, ఏఐ వాడండి

**మొదటిపేజీ తరువాయి -** టెక్నాలజీని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సీఎం చంద్రబాబు జిల్లా కలెక్టర్లకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ల సదస్సులో పాల్గొన్న ఆయన.. ప్రజా ఫిర్యాదుల పరిష్కారం, పాలనలో టెక్నాలజీ వినియోగం, ప్రజల్లో ప్రభుత్వంపై సానుకూల దృక్పథం పెంపొందించడం అనే మూడు కీలక అంశాలపై ప్రధానంగా దృష్టి సారించారు. క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారంతో పాటు ప్రభుత్వ పథకాలు ప్రజలకు సులభంగా చేరినప్పుడే వాటికి సార్థకత లభిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. "ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)కు వచ్చే దరఖాస్తులను ప్రజలకు పూర్తి సంతృప్తి కలిగేలా పరిష్కరించాలి. ఇందుకోసం జిల్లా స్థాయిలో కలెక్టర్లు, నియోజకవర్గ స్థాయిలో ఎమ్మెల్యేలు, మండల స్థాయిలో అధికారులు తరచూ గ్రామాల్లో పర్యటించాలి. ఇలా నెలకు నాలుగుసార్లు క్షేత్రస్థాయికి వెళ్తే చాలా సమస్యలు అక్కడికక్కడే పరిష్కారమవుతాయి. ఈ పర్యటనల వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలి" అని ఆదేశించారు. పాలనలో టెక్నాలజీ ప్రాధాన్యాన్ని వివరిస్తూ, ప్రభుత్వ శాఖలన్నీ టెక్నాలజీ ఇంటిగ్రేషన్‌తో పనిచేయాలని సూచించారు. "అన్ని రంగాల్లో డీప్ టెక్నాలజీని అమలు చేయాలి. దీని ద్వారా అదనపు అభివృద్ధి సాధించవచ్చు, ప్రభుత్వానికి రెవెన్యూ పెంచుకోవచ్చు. డేటా లేక్‌లో కచ్చితమైన సమాచారాన్ని నమోదు చేసేందుకు ప్రత్యేక విధివిధానాలు రూపొందించండి. ప్రతి శాఖ ఏఐ స్టాక్ టెక్నాలజీని వాడాలి. ఇప్పటికే జీఎస్టీలో ఏఐ వినియోగం సత్ఫలితాలనిస్తోంది. ఇదే తరహాలో, కోర్టుల్లో పేరుకుపోయిన కేసుల పరిష్కారానికి లీగల్ ఏఐ స్టాక్ వినియోగించాలని నిర్ణయించాం" అని చంద్రబాబు వివరించారు. ప్రజల కోసం ఎన్నో పథకాలు, పాలసీలు తీసుకొస్తున్నామని, వాటిని సులభంగా అందించినప్పుడే ప్రజల్లో ప్రభుత్వం పట్ల సానుకూల దృక్పథం పెరుగుతుందని సీఎం అన్నారు. "ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలపై ప్రజల్లో పాజిటివ్ పర్సెప్షన్ రావాలి. లోటుపాట్లను ఎప్పటికప్పుడు సవరించుకుని మరింత సమర్థంగా సేవలు అందించాలి. పనిచేసే వారిని గుర్తించి ప్రోత్సహించండి, సరిగా పనిచేయని వారిని పక్కన పెట్టండి" అని కఠినంగా సూచించారు. స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సిబ్బంది పనితీరును మెరుగుపరచడంపై కూడా సీఎం కీలక ఆదేశాలు జారీ చేశారు. "ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా స్వర్ణ గ్రామ, వార్డు సిబ్బందికి స్పష్టమైన విధులతో కూడిన జాబ్ ఛార్ట్ సిద్ధం చేయాలి. కొందరిపై ఎక్కువ పనిభారం, మరికొందరిపై తక్కువ పనిభారం ఉన్నట్లు గమనించాం. దీన్ని సరిచేసి పనిని హేతుబద్ధీకరించాలి . ప్రతి కార్యాలయానికి ఒక ఈవీ సైకిల్ అందించండి" అని తెలిపారు. ఇదే సమావేశంలో మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ.. జిల్లాల ఆర్థిక నివేదికలతో పాటు, పాలనపై ప్రజల్లో ఉన్న సానుకూల దృక్పథం వివరాలను మంత్రులు, ప్రజాప్రతినిధులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని కలెక్టర్లను కోరారు. మొత్తం మీద, టెక్నాలజీని వాడుకుంటూ, ప్రజా సమస్యలను పరిష్కరించి, పాలనపై సానుకూలత పెంచడమే లక్ష్యంగా పనిచేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

### స్టార్టప్‌ల కోసం భారత్‌లో ప్రపంచస్థాయి ఎకోసిస్టమ్

**మొదటిపేజీ తరువాయి -** ఆయన స్పష్టం చేశారు. దిల్లీలో జరిగిన బ్రిక్స్ బిజినెస్ ఫోరమ్ లీడర్స్ సెషన్‌లో ప్రధాని మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు.వ్యాపారాలకు అడ్డంకుల్ని తొలగించడం, ఈ రంగంలో సరికొత్త అవకాశాల్ని మరింత విస్తరించడంపైనే భారత్ దృష్టి సారిస్తుందని, ఇదే తమ విధానమని మోదీ వ్యాఖ్యానించారు. సెప్టెంబర్ 12,13 తేదీల్లో దిల్లీ భారత్ మండపం వేదికగా 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు జరగనుండగా, దాని ముందస్తు కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం బ్రిక్స్ బిజినెస్ ఫోరమ్ నాయకుల సమావేశం నిర్వహించారు. ఇంకా తాము స్టార్టప్స్, మీవీజులకు ప్రత్యేక ప్రోత్సాహం ఇస్తున్నామని మోదీ చెప్పారు. ఇదే సెషన్‌లో యూపీఐ డిజిటల్ పేమెంట్స్ గురించి కూడా ప్రస్తావించారు.'నేడు ప్రపంచవ్యాప్తంగా వాణిజ్యపరమైన ఆంక్షలు (ట్రేడ్ బారియర్స్) పెరుగుతున్నాయి. భారత్ మాత్రం ఆర్థిక సంబంధాల్ని బలోపేతం చేసే దిశగా ఆర్థిక వారధుల్ని నిర్మిస్తోంది. 2014 నుంచి మేము దాదాపు 40 దేశాలతో స్వేచ్ఛాయుత వాణిజ్య ఒప్పందాలు చేసుకున్నాం. అందుకే భారత్ బ్రిక్స్‌కు అధ్యక్షత వహిస్తున్న ఈ వేళ వ్యవసాయం, ఆరోగ్యం, నైపుణ్యాభివృద్ధి, స్మార్ట్ గ్రిడ్స్ వంటి రంగాల్లో కొత్త సహకార నెట్‌వర్క్‌లను ఏర్పాటు చేశామన్నభారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ.

### భారత్‌కు బ్రిక్స్ సవాల్.. రూ. 21.57 లక్షల కోట్లకు చేరిన వాణిజ్య లోటు!

**మొదటిపేజీ తరువాయి -** లక్షల కోట్లు) కు చేరడం ఆందోళన కలిగిస్తోంది. గత ఐదేళ్లలో బ్రిక్స్ దేశాలతో భారత్ మొత్తం వాణిజ్యం రెట్టింపై సుమారు 417.5 బిలియన్ డాలర్లకు చేరినప్పటికీ, లోటు కూడా అదే స్థాయిలో పెరగడం గమనార్హం.గణాంకాలను పరిశీలిస్తే.. గత ఐదేళ్లలో బ్రిక్స్ దేశాలకు భారత్ ఎగుమతులు 48.8% వృద్ధితో 95.7 బిలియన్ డాలర్లకు చేరాయి. అయితే, ఇదే సమయంలో దిగుమతులు ఏకంగా 131.8% పెరిగి 321.8 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. ప్రస్తుతం భారతదేశ మొత్తం దిగుమతుల్లో 40% బ్రిక్స్ దేశాల నుంచే వస్తుండగా, మన ఎగుమతుల్లో కేవలం 22% మాత్రమే ఆ దేశాలకు వెళ్తున్నాయి. ఈ భారీ వాణిజ్య లోటుకు ప్రధానంగా చైనా, రష్యాలే కారణమవుతున్నాయి. మొత్తం లోటులో దాదాపు సగం చైనా నుంచే ఉండగా.. యంత్ర పరికరాలు, ఎలక్ట్రానిక్స్, పారిశ్రామిక ముడిసరుకుల దిగుమతులే అధికంగా ఉన్నాయి. మరోవైపు రష్యా నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్న ముడి చమురు భారత్ ఇంధన భద్రతకు మేలు చేస్తున్నప్పటికీ, వాణిజ్య లోటును గణనీయంగా పెంచుతోంది.ఈ వాణిజ్య అసమతుల్యతను కేవలం ప్రతికూల అంశంగా చూడలేమని, ఇది నిర్మాణాత్మక లోపాన్ని సూచిస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. బ్రిక్స్ దేశాలకు భారత్ ఒక ముఖ్యమైన కొనుగోలు మార్కెట్‌గా మారింది కానీ, ఆ దేశాలకు కీలక సరఫరాదారుగా మాత్రం మారలేకపోయింది. ఈ నేపథ్యంలో బ్రిక్స్ ఛైర్మన్‌షిప్ హోదాను భారత్ ఒక అవకాశంగా వినియోగించుకుంటోంది. తమ ఉత్పత్తులకు ఇతర సభ్య దేశాల మార్కెట్లలో సమాన, సులభతర అవకాశాలు కల్పించాలని గట్టిగా పట్టుబడుతోంది.ముఖ్యంగా ఫార్మాస్యూటికల్స్, ఇంజనీరింగ్ వస్తువులు, ఆటోమొబైల్స్, ఫుడ్ ప్రాసెసింగ్, రసాయనాలు, డిజిటల్ సేవల వంటి రంగాల్లో ఉన్న టారిఫ్ యేతర అడ్డంకులను తొలగించాలని భారత్ కోరుతోంది. వేగవంతమైన కస్టమ్స్ క్లియరెన్స్, ప్రమాణాల పరస్పర గుర్తింపు వంటి అంశాలపై రంగాల వారీగా చర్చలు జరపాలని ప్రతిపాదిస్తోంది.కేవలం వాణిజ్య లోటు అంకెలను తగ్గించుకోవడంపైనే కాకుండా బ్రిక్స్ సరఫరా గొలుసులో భారత్‌ను ఒక కీలక భాగస్వామిగా నిలబెట్టడం ద్వారా దీర్ఘకాలిక ప్రయోజనాలు పొందాలని కేంద్ర ప్రభుత్వం వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది.

### ఖైరతాబాద్ గణేష్ ఉత్సవాలు

**మొదటిపేజీ తరువాయి -** హైదరాబాద్‌లో వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో నగర ట్రాఫిక్ పోలీసులు కీలక ప్రకటన విడుదల చేశారు. ప్రసిద్ధ ఖైరతాబాద్ మహాగణపతిని దర్శించుకునేందుకు వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, ఈ నెల 12 నుంచి 24వ తేదీ వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు వెల్లడించారు. ఈ 13 రోజుల పాటు రోజూ ఉదయం 11 గంటల నుంచి భక్తుల రద్దీని బట్టి రాత్రి వరకు ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయని స్పష్టం చేశారు.పోలీసులు ప్రకటన ప్రకారం, పాత సైఫాబాద్ పోలీస్ స్టేషన్ నుంచి బడా గణేష్ వైపు వచ్చే వాహనాలను ఇక్బాల్ మినార్ మీదుగా మళ్లిస్తారు. ఇక్బాల్ మినార్ నుంచి ఐమ్యాక్స్ వైపు వెళ్లే వాహనాలు సచివాలయం ఎక్స్ రోడ్ మీదుగా ప్రయాణించాల్సి ఉంటుంది. అదేవిధంగా, నెక్లెస్ రోటరీ నుంచి మింట్ కాంపౌండ్ వైపు వెళ్లే ట్రాఫిక్‌ను సచివాలయం జంక్షన్, ఖైరతాబాద్ ఫ్లైఓవర్ మీదుగా అనుమతిస్తారు. నిరంకారి నుంచి ఖైరతాబాద్ రైల్వే గేట్ వైపు వచ్చే వాహనాలను పాత సైఫాబాద్ పీఎస్ జంక్షన్ మీదుగా మళ్లిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.గణపతి దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేకంగా పార్కింగ్ ప్రదేశాలను కేటాయించారు. రేస్ కోర్స్ రోడ్, ఎన్టీఆర్ ఘాట్, ఐమ్యాక్స్ సమీపంలోని హెచ్ఎండీఏ పార్కింగ్ స్థలం, ఐమ్యాక్స్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో వాహనాలను పార్క్ చేసుకోవచ్చు. ఖైరతాబాద్ జంక్షన్ నుంచి వచ్చే భక్తుల కోసం విశ్వేశ్వరయ్య భవన్‌లో పార్కింగ్ ఏర్పాటు చేశారు. వాహనదారులు రద్దీగా ఉండే మార్గాలకు బదులుగా ప్రత్యామ్నాయ రహదారులను ఎంచుకోవాలని పోలీసులు సూచించారు. అత్యవసర సహాయం కోసం 90102 03626 హెల్ప్‌లైన్ నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

### మోదీతో జిన్‌పింగ్ భేటీకి ముందు చైనా కీలక ప్రకటన

**మొదటిపేజీ తరువాయి -** పరిష్కరించుకునేందుకు సిద్ధంగా ఉన్నామని చైనా స్పష్టం చేసింది. ఇరు దేశాలు మంచి పొరుగుదేశాలుగా, స్నేహపూర్వకంగా కలిసి పనిచేయాలని కోరుకుంటున్నట్లు తెలిపింది.భారత్‌లో జరుగుతున్న బ్రిక్స్ సదస్సు సందర్భంగా మోదీ, జిన్‌పింగ్ సమావేశం కానున్నారు. 2019 తర్వాత జిన్‌పింగ్ భారత్‌కు రావడం ఇదే తొలిసారి. దీంతో ఈ భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది. 2020లో తూర్పు లద్దాఖ్‌లోని గల్వాన్ లోయలో ఇరు దేశాల సైనికుల మధ్య ఘర్షణ తర్వాత సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి.2024 అక్టోబర్‌లో భారత్, చైనా సరిహద్దుల్లో గస్తీకి సంబంధించి కీలక ఒప్పందానికి వచ్చాయి. దీంతో ఇరు దేశాల మధ్య సంబంధాలు మళ్లీ క్రమంగా మెరుగుపడుతున్నాయి. గత ఏడాది ఆగస్టులో ప్రధాని మోదీ చైనాలో పర్యటించారు. ఆ తర్వాత ఉన్నతస్థాయి సంప్రదింపులు మరింత పెరిగాయి.చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మావో నింగ్ మాట్లాడుతూ.. ఇరు దేశాల నేతల మార్గదర్శకత్వంలో వ్యూహాత్మక, దీర్ఘకాలిక దృక్పథంతో సంబంధాలను ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. పరస్పరం సంప్రదింపులు పెంచడం, సహకారాన్ని బలోపేతం చేయడం, విభేదాలను సరిగా నిర్వహించడం తమ లక్ష్యాలని తెలిపారు.మోదీ, జిన్‌పింగ్ వరుసగా మూడో ఏడాది సమావేశం కానున్నారు. గతంలో 2025 ఆగస్టులో చైనాలోని టియాంజిన్‌లో జరిగిన షాంఘై సహకార సంస్థ సదస్సు సందర్భంగా ఇరువురు నేతలు ద్వైపాక్షిక చర్చలు జరిపారు. విమాన సర్వీసులు, వీసాలు, ఉన్నతస్థాయి సంబంధాలు కూడా క్రమంగా పునరుద్ధరించుకుంటున్నాయి.బ్రిక్స్ సహకారాన్ని మరింత బలోపేతం చేసేందుకు అన్ని సభ్య దేశాలతో కలిసి పనిచేస్తామని చైనా తెలిపింది. అంతర్జాతీయ పరిస్థితులు, బ్రిక్స్ భవిష్యత్ అభివృద్ధి, పరస్పర సహకారంపై జిన్‌పింగ్ ఇతర దేశాల నేతలతో చర్చించనున్నారు. బ్రిక్స్‌ను 2009లో ప్రధాన అభివృద్ధి చెందుతున్న దేశాల వేదికగా ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇందులో ఇరాన్, సౌదీ అరేబియా, యూఏఈ సహా మరిన్ని దేశాలు ఉన్నాయి.

## రైతుల మోటార్లకు ఎట్టి పరిస్థితుల్లో మీటర్లు పెట్టబోము

**మొదటిపేజీ తరువాయి -** వినియోగదారులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కోసం 5,000 కోట్లు చెల్లిస్తోందని భట్టి విక్రమార్క తెలిపారు. ఈ విధంగా కేవలం సబ్సిడీల రూపంలోనే ఏటా దాదాపు రూ.19,000 కోట్లు ఖర్చవుతోందని ఆయన వివరించారు. ఈ నిధులను సోలరైజేషన్ వైపు మళ్లిస్తే ఖజానాపై భారం తగ్గడంతో పాటు రైతులు స్వయంసమృద్ధి సాధిస్తారన్నారు. పగటిపూట లభించే సోలార్ విద్యుత్ రాత్రివేళ అందుబాటులో ఉండనందున, ఎంపిక చేసిన గ్రామాల్లో బ్యాటరీ స్టోరేజ్ సిస్టమ్స్‌తో మైక్రో గ్రిడ్లను నిర్మిస్తున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు.సోలార్ విద్యుత్‌తో పాటు బ్యాటరీ స్టోరేజ్ ద్వారా గ్రామాలకు విద్యుత్ ఇచ్చే 'మైక్రో గ్రిడ్' ప్రాజెక్టులను ప్రయోగా త్మకంగా (పైలట్) చేపట్టామని ఆయన మండలిలో వివరించారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే వీజీఎఫ్ ద్వారా మూడుసార్లు టెండర్లు పిలిచినా, బ్యాటరీ స్టోరేజ్ ఖర్చులు ఎక్కువగా ఉండటం వల్ల కాంట్రాక్టర్లు ముందుకు రాలేదని పేర్కొన్నారు. భవిష్యత్తులో సాంకేతికత పెరిగి బ్యాటరీ ధరలు తగ్గితే ఈ ప్రాజెక్టులు వేగవంతమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు తగినట్లుగా పర్యావరణహితమైన హరిత ఇంధన రంగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం



చేశారు. శాసనమండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం ఇస్తూ తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ-2025 విశేషాలను వివరించారు.గత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 2014 నాటికి రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ కేవలం 15,497 మెగావాట్లుగా మాత్రమే ఉండేదని, అయితే సెప్టెంబర్ 9 నాటికి అది 19,543 మెగావాట్లకు చేరిందని భట్టి విక్రమార్క వెల్లడించారు. వివిధ కారణాల రీత్యా ఈ ఏడాది డిమాండ్ 20,000 నుంచి 21,000 మెగావాట్లకు పెరిగే అవకాశం ఉందని, ఈ భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకునే సాంప్రదాయ, సాంప్రదాయేతర ఇంధన వనరులను సమన్వయం చేస్తూ ఈ నూతన పాలసీని తెచ్చినట్లు తెలిపారు."రైతుల మోటార్లకు ఎట్టి పరిస్థితుల్లో మీటర్లు పెట్టబోము. విద్యుత్ వ్యవస్థలో లోపాల సవరణకు రూ.వేల కోట్లు ఖర్చవుతుంది. లోపాలు సరిచేసుకోకుండా విద్యుత్ ట్రాన్స్‌మిషన్ చేయలేము. ఆర్‌డీఎస్ఎస్ స్కీమ్ కింద 60 శాతం గ్రాంటు ఇస్తారు. రాష్ట్రం మిగతా 40 శాతం భరిస్తే ఎంత డిమాండ్ ఉన్నా ఇబ్బంది ఉండదు. రాష్ట్రంలో 19 వేల మెగావాట్ల విద్యుత్ డిమాండ్ ఉంది. భారీ విద్యుత్ డిమాండ్ ఉన్నా ప్రస్తుత వ్యవస్థ ద్వారానే ట్రాన్స్‌మిషన్ చేస్తున్నారు. గ్రిడ్ కుప్పకూలకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నాం"- భట్టి విక్రమార్క, ఉపముఖ్యమంత్రి.పీఎం-కుసుమ్ పథకం కింద రైతులకు 2,000 మెగావాట్ల సోలార్ విద్యుత్ అందించాలని నిర్ణయించినట్లు భట్టి వెల్లడించారు. ఒక్కొక్కరు 2 మెగావాట్ల చొప్పున సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకునేలా రైతులను ప్రోత్సహిస్తున్నామన్నారు. అచ్చంపేట నియోజకవర్గంలోని మన్ననూరు ప్రాంతంలో పైలట్ ప్రాజెక్ట్‌గా పూర్తి సోలరైజేషన్ పూర్తి చేసి ప్రారంభించినట్లు తెలిపారు. కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్రాజెక్టులను ప్రభుత్వం పూర్తిస్థాయిలో ప్రోత్సహిస్తోందని, ఇటీవల కరీంనగర్‌లో ఒక ప్లాంట్‌కు శంకుస్థాపన చేసినట్లు గుర్తుచేశారు. మణుగూరు వద్ద సింగరేణి చేపట్టిన మిథేన్ గ్యాస్ ప్రాజెక్ట్ ఖర్చు ఎక్కువగా ఉండటంతో గిట్టుబాటు కాలేదని, అయితే కోల్ గ్యాసిఫికేషన్‌పై అధ్యయనం జరుపుతున్నామని తెలిపారు.

### కొండా సురేఖకు బుజ్జగింపులు



**మొదటిపేజీ తరువాయి -** మొదటిపేజీ తరువాయి - తెలంగాణ మాజీ మంత్రి కొండా సురేఖకు రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ ఫోన్ చేసినట్లు సమాచారం. ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో, సురేఖతో ఆమె నేరుగా సంభాషించినట్లు తెలియడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.రాష్ట్ర రాజకీయాలు, పార్టీలో చోటుచేసుకుంటున్న తాజా పరిణామాలపై వీరిద్దరి మధ్య చర్చ జరిగినట్లు తెలుస్తోంది. వ్యక్తిగత అంశాలు, అంతర్గత విభేదాలను పక్కనపెట్టి పార్టీ కార్యక్రమాల్లో తిరిగి చురుగ్గా పాల్గొనాలని ఈ సందర్భంగా మీనాక్షి నటరాజన్.. కొండా సురేఖకు సూచించినట్లు పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది.ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిఫార్సు మేరకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించిన సంగతి తెలిసిందే. కేబినెట్ నుంచి తప్పించిన తర్వాత జరుగుతున్న అసెంబ్లీ సమావేశాలకు సురేఖ గైర్హాజరు కావడం కాంగ్రెస్ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలో, పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకే ఇన్‌ఛార్జ్ నేరుగా సురేఖతో మాట్లాడినట్లు సమాచారం. ఈ ఫోన్ కాల్ అనంతరం సురేఖ అసెంబ్లీ సమావేశాలకు హాజరవుతారా లేదా అన్నది ఇప్పుడు సర్వత్రా ఆసక్తికరంగా మారింది.

### పురపాలక పాలనలో ట్రాన్స్‌జెండర్లు



**మొదటిపేజీ తరువాయి -** తెలిపింది. ఈ నిర్ణయంతో పురపాలక పరిపాలనలో, విధాన నిర్ణయాల్లో ట్రాన్స్‌జెండర్ల భాగస్వామ్యానికి మార్గం సుగమమైంది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తరఫున రాష్ట్ర శాసనసభా వ్యవహారాల మంత్రి డి. శ్రీధర్ బాబు 'తెలంగాణ మున్సిపాలిటీల (నాలుగో సవరణ) బిల్లు, 2026'ను సభలో ప్రవేశపెట్టారు. 2019 నాటి తెలంగాణ మున్సిపాలిటీల చట్టానికి ఈ బిల్లు సవరణలు ప్రతిపాదిస్తుంది. దీని ప్రకారం, హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) వెలుపల ఉన్న తొమ్మిది మున్సిపల్ కార్పొరేషన్లలో ఒక్కో ట్రాన్స్‌జెండర్‌ను నామినేటెడ్ సభ్యునిగా కో-ఆప్ట్ చేసుకునే అవకాశం కలుగుతుంది.ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, సామాజిక వివక్ష, వెలికి గురవుతున్న ట్రాన్స్‌జెండర్లను ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడంతో పాటు, ప్రజా జీవితంలో వారి భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగానే ఈ సంస్కరణలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ బిల్లుకు బీజేపీ, సీపీఐ సహా ఇతర పక్షాల సభ్యులు మద్దతు ప్రకటించగా, అనంతరం సభ దీనిని ఏకగ్రీవంగా ఆమోదించింది.


## పాలనలో స్పీడ్ పెరగాల్సిందే

**మొదటిపేజీ తరువాయి -** అభిప్రాయాలతో రూపొందిస్తామని తెలిపారు. కార్యదర్శులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పర్యటించి, ప్రజల నుంచి నేరుగా అభిప్రాయాలు సేకరించాలని, అప్పుడే పనితీరును మెరుగుపరుచుకోగలమని సూచించారు.ప్రభుత్వ కార్యకలాపాల్లో పారదర్శకత, వేగం కోసం కీలక నిర్ణయం తీసుకున్నారు. నెల రోజుల్లో అన్ని శాఖల దస్త్రాలను పూర్తిగా ఆన్‌లైన్‌లోకి మార్చాలని స్పష్టం చేశారు. ఈ గడువు తర్వాత భౌతిక (మాన్యువల్) ఫైళ్ల నిర్వహణను తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరించారు. ఈ అంశంపై నెల రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశిస్తూ, మంత్రులు కూడా దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చంద్రబాబు సూచించారు.ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా వచ్చే దరఖాస్తులను ప్రజలు సంతృప్తి చెందేలా పరిష్కరించాలని కలెక్టర్లకు సూచించారు. "జిల్లా స్థాయిలో కలెక్టర్లు, నియోజకవర్గ స్థాయిలో ఎమ్మెల్యేలు, మండల స్థాయిలో అధికారులు తరచుగా గ్రామాలకు వెళ్తే చాలా సమస్యలు అక్కడికక్కడే పరిష్కారమవుతాయి. ఇకపై ఈ పర్యటనల వివరాలను కూడా సమర్పించాలి" అని అన్నారు.సమస్యలు లేని సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలపై ప్రజల్లో సానుకూల దృక్పథం ఏర్పడాలని ఆకాంక్షించారు. పనితీరు సరిగా లేని వారిని పక్కనపెట్టి, సమర్థంగా పనిచేసే వారిని గుర్తించి ప్రోత్సహించాలని స్పష్టం చేశారు.స్వర్ణ గ్రామ, వార్డు కార్యాలయాల్లో సిబ్బందిపై పనిభారాన్ని హేతుబద్ధీకరించాలని (రేషనలైజ్ చేయాలని) అధికారులను ఆదేశించారు. ఒకే ఉద్యోగిపై ఎక్కువ భారం మోపకుండా, అందరికీ సమంగా బాధ్యతలు అప్పగించేలా చూడాలన్నారు. ప్రతి పంచాయతీ పరిధిలోని స్వర్ణ గ్రామ సిబ్బందికి విధులను స్పష్టం చేస్తూ ఒక జాబ్ ఛార్ట్ సిద్ధం చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతి స్వర్ణవార్డు, గ్రామ కార్యాలయానికి ఒక ఎలక్ట్రిక్ సైకిల్ అందించాలని కూడా సూచించారు.

### స్థానిక సంస్థల ఎన్నికలపై షర్మిల కీలక నిర్ణయం

**మొదటిపేజీ తరువాయి -** క్షేత్రస్థాయిలో ప్రచారాన్ని వేగవంతం చేయడం కోసం 8 మంది సీనియర్ నాయకులతో కూడిన 'రాష్ట్ర స్థాయి మానిటరింగ్ కమిటీ'ని ఆమె ఏర్పాటు చేశారు. ఈ అత్యున్నత కమిటీకి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సభ్యులు, మాజీ మంత్రి రఘువీరారెడ్డిని ఛైర్మన్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.ఈ మానిటరింగ్ కమిటీలో మాజీ కేంద్ర మంత్రులు, సీనియర్ నాయకులకు ప్రాధాన్యత కల్పించారు. కమిటీ కన్వీనర్‌గా మాజీ కేంద్ర మంత్రి, ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జేడీ శీలం బాధ్యతలు నిర్వర్తించనున్నారు. సభ్యులుగా సీడబ్ల్యూసీ సభ్యులు గిడుగు రుద్రరాజు, మాజీ కేంద్ర మంత్రులు పల్లంరాజు, కిల్లి కృపారాణి, ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్ వలి, రాజ్యసభ మాజీ సభ్యుడు, పార్టీ అధికార ప్రతినిధి తులసిరెడ్డిని నియమించారు. వీరితో పాటు స్థానిక ఎన్నికలకు సంబంధించి సోషల్ మీడియా నిర్వహణ, ఎన్నికల సమన్వయ ఇన్చార్జి బాధ్యతలను నెల్లూరు డీసీసీ అధ్యక్షుడు కిరణ్ కుమార్ రెడ్డికి అప్పగించారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గరిష్ఠ సంఖ్యలో స్థానాలను కైవసం చేసుకునేలా ప్రణాళికలు రూపొందించాలని మానిటరింగ్ కమిటీకి షర్మిల స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ఎన్నికల విధివిధానాల ఖరారు, గెలుపు గుర్రాలైన అభ్యర్థుల ఎంపిక, ప్రచార వ్యూహాలు, క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారం వంటి కీలక అంశాల బాధ్యతలను ఈ కమిటీయే చూస్తుందని ఆమె వివరించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు, నగర కాంగ్రెస్ అధ్యక్షులు మానిటరింగ్ కమిటీతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని ఆదేశించారు.

### టోల్ ప్లాజాల వద్ద ఇక ఆగాల్సిన పనిలేదు



**మొదటిపేజీ తరువాయి -** జరుగుతున్న 'గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2026'లో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న ఫాస్టాగ్‌కు వాహన నంబర్‌ప్లేట్ గుర్తింపు సాంకేతికతను జోడించనున్నట్లు చెప్పారు. ఫాస్టాగ్, నంబర్‌ప్లేట్ రెండింటి సాయంతో వాహనాలను గుర్తించి టోల్ వసూలు చేస్తారు.కొత్త విధానం వల్ల టోల్ వసూళ్లు ఏటా రూ.10 వేల కోట్లు పెరిగే అవకాశం ఉందని గడ్కరీ చెప్పారు. టోల్ చెల్లించేందుకు వాహనాలు ఆగకపోవడంతో ప్రయాణ సమయం కూడా తగ్గుతుందని తెలిపారు.ఫాస్టాగ్ రాకతో టోల్ ప్లాజాల వద్ద వేచి చూసే సమయం ఇప్పటికే 80-90 శాతం తగ్గిందని మంత్రి చెప్పారు. గతంలో 12 నిమిషాల వరకు ఉండే నిరీక్షణ కొన్ని చోట్ల 30 నిమిషాలకు చేరేదన్నారు. ఇప్పుడు మిగిలిన ఆలస్యాన్ని కూడా సాంకేతికతతో తొలగించనున్నట్లు వివరించారు.ఫాస్టాగ్‌ను 2016లో ప్రవేశపెట్టారు. 2021లో దేశవ్యాప్తంగా తప్పనిసరి చేశారు. వాహనం టోల్ ప్లాజాను దాటుతున్నప్పుడు ఫాస్టాగ్ ద్వారా అనుసంధానిత ఖాతా నుంచి రుసుము ఆటోమేటిక్‌గా కట్ అవుతుంది. నగదు చెల్లింపులతో పాటు చిల్లర కోసం ఎదురుచూడాల్సిన అవసరం లేకపోవడంతో టోల్ వసూళ్లు వేగంగా మారాయి.ఇక తదుపరి దశలో టోల్ ప్లాజాల వద్ద అడ్డంకులే లేకుండా వాహనాలు నేరుగా వెళ్లేలా వ్యవస్థను రూపొందిస్తున్నారు.

## స్తంభంపల్లి ప్రాథమిక,మరియు ఉన్నత పాఠశాలల ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం







**వెల్గటూర్ సెప్టెంబర్ 11 ( ప్రజా మంటలు ) :** ఇటీవల జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా స్తంభంపల్లి ప్రాథమిక, ఉన్నత పాఠశాల ల నుండి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు గుగ్గిల్ల రవీందర్, పూర్మ దేవేందర్ లకు రావడం జరిగింది..అలాగే మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ప్రాథమిక, ఉన్నత పాఠశాలల నుండి రాజేశ్వరి, విజయగీత లు పొందడం జరిగింది మరియు తెలుగు పద్య పఠనలో మండల స్థాయి లో మొదటి విజేత చంబార్తి అశ్విత, రెండవ విజేత లవంగపు దీప్తి ఈ విద్యార్థులకి సన్మానం చేయడం జరిగింది. దీనికి గాను గ్రామ పాలక మండలి చే సన్మానిస్తూ స్తంభంపల్లి నుండి జిల్లా లోనే రెండు పాఠశాల లకు జిల్లా,మండల స్థాయిలో ఒకేసారి 4 గురి కి అవార్డులు రావడం చాలా సంతోషదాయకం అని గ్రామ సర్పంచ్ భూపెల్లి రాజయ్య గారు తెలియజేశారు.. ఈ గ్రామ విద్యా అభివృద్ధికి తమ వంతు కూడా పాటుపడతామని ఉపసర్పంచ్ యాగండ్ల గంగారాజం మాట్లాడారు..ఇట్టి కార్యక్రమంలో~బాల్రాజ చైర్ పర్సన్ దీ. మౌనిక మరియు వార్డు మెంబర్లు,గ్రామ యువకులు ప్రశాంత్ ,ఇరు పాఠశాల ల ఉపాధ్యాయులు ,పాల్గొన్నారు..

## అంగన్ వాడి వారి ఆధ్వర్యంలో ఘనంగా పోషణ మహోత్సవ వేడుకలు



**-వెల్గటూర్, సెప్టెంబర్ 11 (ప్రజా మంటలు) :** జగిత్యాల జిల్లాలోని వెల్గటూర్ మండలం లోని బీర్ సాని గ్రామంలో గల స్థానిక అంగన్ వాడి కేంద్రం యందు గురువారం రోజు ఉదయం వేళలో.. అంగన్ వాడి వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోషణ మహోత్సవ వేడుకలలో భాగంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ.. పోషణ మాసం అనగా సెప్టెంబర్ 9వ తేదీ నుండి అక్టోబర్ 8వ్ తేది వరకు పోషణ మాస వేడుకలను ఎంతో ఘనంగా నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు మీడియాతో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం వారి పోషణ అభ్యాన్ కార్యక్రమాలతో పాటు, ఈ నెల రోజుల కార్యక్రమం నందు సరైన అవగాహన లతో పాటు, ఏ విధమైన ఆహారం, తృణ ధన్యాలు, పాలు, కోడి గుడ్లు, మంచి ఆహారం తీసుకోవాలి అని ఉద్దేశ్యం లతో ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు వారు మీడియాకు తెలిపారు. ఇట్టి కార్యక్రమానికి హాజరు అయినా గర్భిణీ స్త్రీలు, బాలింతలకు సరైన సమయంలో సరైన ఆహారం తీసుకోవాలని ఈ కార్యక్రమంను ఉద్దేశించి తమ అమూల్యమైన సందేశాన్ని ఇచ్చారు. ఇట్టి కార్యక్రమంలో వారితో, అంగన్ వాడి ఉపాధ్యాయురాలు సువర్ణ, గీతా, బీర్ సాని గ్రామ సర్పంచ్ కారుకూరి శరణ్య - చంద్ర శేఖర్, ఉపసర్పంచ్, గ్రామ పంచాయతీ పాలక వర్గం,గ్రామ కార్యదర్శి, ఐసీడీఎస్ సూపర్వైజర్, అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు, అంగన్ వాడి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## గొల్లపల్లి మండలం లోని గణేశ్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించు కోవాలి



### సీఐ, రామ్ నరసింహారెడ్డి

**గొల్లపల్లి సెప్టెంబర్ 11 ప్రజా మంటలు :** గొల్లపల్లి మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో గణేశ్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గణేశ్ మండపాల నిర్వాహకులతో గొల్లపల్లి పోలీసుల" పీస్" కమిటీ సమావేశం లో ధర్మపురి సీఐ,రామ్ నర్సింహారెడ్డి గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులను ఉద్దేశించి మాట్లాడుతూ గణేశ్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని, మండపాల వద్ద శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా నిర్వాహకులు బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు ఎస్ఐ,కృష్ణ సాగర్ రెడ్డి మాట్లాడుతూ,గణేశ్ మండపాల వద్ద విద్యుత్ వైర్లు, అగ్నిప్రమాదాల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లేందుకు మార్గం ఖాళీగా ఉంచాలి డీజేలు, లౌడ్స్పీకర్లు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను పాటిస్తూ అసభ్యకరమైన పాటలు, నృత్యాలు, అలాగే అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు ఉత్సవ కమిటీ సభ్యులు, వాలంటీర్లు సమన్వయంతో పనిచేసి, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలి నిమజ్జనం వెళ్లే సమయంలో వాహనాలపై మద్యం సేవించకుండా, ట్రాఫిక్ నియంత్రణలను పాటించి,గణేశ్ నవరాత్రి ఉత్సవాలను సామరస్యంతో, ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా, ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసు శాఖకు సహకరించాలని కోరారు.ఈ సమావేశంలో ఎంపీడీవో రవీందర్ రావు,విద్యుత్ శాఖ సబ్ ఇంజనీర్, ఎస్ఐ, కృష్ణ సాగర్ రెడ్డి, మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు పోలీస్ సిబ్బంది గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు

## బాధిత యువకుడికి బ్యాటరీ వాహనం అందజేత



**సికింద్రాబాద్, సెప్టెంబర్ 11 (ప్రజా మంటలు):** ప్రమాదవశాత్తు రెండు కాళ్లు కోల్పోయిన ఓ యువకుడికి కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి సహకారంతో బ్యాటరీ వాహనాన్ని అందజేశారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ పరిధిలోని సీసీ నగర్‌కు చెందిన గడ్డం హరి ప్రసాద్ రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లు పోగొట్టుకుని తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని స్థానిక బీజేపీ నాయకులు గుర్తించారు. బాధితుడి పరిస్థితిని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, అతడికి మూడు చక్రాల బ్యాటరీ వాహనం అందించాలని విజ్ఞప్తి చేశారు.దీనికి సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సహకారంతో బాధిత యువకుడికి బ్యాటరీ వాహనాన్ని సమకూర్చారు. ఈ వాహనం అందడంతో నిత్య జీవితంలో ఇతరులపై ఆధారపడకుండా సొంతంగా రాకపోకలు సాగించే వెసులుబాటు కలిగిందని హరి ప్రసాద్, ఆయన కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. తమ కష్టాన్ని గుర్తించి ఆదుకున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో పాటు ఇందుకు చొరవ చూపిన బీజేపీ నాయకులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ టి.రాజశేఖర్ రెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు వై.సురేష్, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి ఎస్.రాజు, నాయకులు ఎ.శ్రీనివాస్, ఎలకొండ శ్రీనివాస్ ముదిరాజ్, కె.కృష్ణ, కె.ఎం.కృష్ణ, అరుణ్ కుమార్, డివిజన్ అధ్యక్షుడు రామంచ మహేష్, ప్రధాన కార్యదర్శి బంధం కిరణ్, భీమ్ రావు, పరమేష్, గణేష్, బి.శ్రీనివాస్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం ప్రజావాణి స్ఫూర్తిదాయకం బీహార్ గ్రూప్-1 అధికారులు



**హైదరాబాద్, సెప్టెంబర్ 11 (ప్రజా మంటలు):** తెలంగాణ సీఎం ప్రజావాణి కార్యక్రమం తమకు స్ఫూర్తినిచ్చిందని బీహార్‌కు చెందిన 120 మంది గ్రూప్-1 అధికారులు తెలిపారు. శుక్రవారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో ప్రజావాణి కార్యక్రమాన్ని పరిశీలించి, వినతుల స్వీకరణ, సంబంధిత శాఖలకు పంపడం, పరిష్కారాన్ని పర్యవేక్షించే విధానాలను తెలుసుకున్నారు.రాష్ట్ర ప్రణాళికా మండలి వైస్ చైర్‌పర్సన్, సీఎం ప్రజావాణి ఇన్‌చార్జ్ గద్వాల్ విజయలక్ష్మి ప్రజల నుంచి వినతులు స్వీకరించి, అర్హమైన సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణి ద్వారా సమస్యల పరిష్కారంలో 74 శాతం సక్సెస్ రేట్ సాధించామని ఆమె తెలిపారు.తెలంగాణ ప్రజావాణి విధానాలను పరిశీలించిన అనంతరం బీహార్‌లోని 'ప్రజా దర్బార్' వ్యవస్థలోనూ ఇలాంటి మార్పులు తీసుకురావడానికి ప్రయత్నిస్తామని అధికారులు వెల్లడించారు.

## జర్నలిజానికి గుర్తింపు బొమ్మెన కుమార్‌కు 'సాక్షి ఎక్సలెన్స్-2026' అవార్డు"

### పాత్రికేయ మిత్రుల సన్మానం



**గొల్లపల్లి సెప్టెంబర్ 11 ప్రజా మంటలు :** క్షేత్రస్థాయి ప్రజా సమస్యలపై నిరంతరం కలం ఝుళిపిస్తూ, విలువలతో కూడిన జర్నలిజంలో తనదైన ముద్ర వేసిన 'సాక్షి' ధర్మపురి నియోజకవర్గ ఆర్సీ ఇన్‌ఛార్జ్ బొమ్మెన కుమార్‌కు ప్రతిష్ఠాత్మక 'సాక్షి ఎక్సలెన్స్ అవార్డు--2026' లభించింది. కరీంనగర్ యూనిట్ కార్యాలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో సాక్షి కరీంనగర్ ఎడిషన్ ఇన్‌ఛార్జ్ ముజాఫర్ చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా గొల్లపల్లి మండల పాత్రికేయ మిత్రుల ఆధ్వర్యంలో కుమార్‌కు ఆత్మీయ అభినందన సభ నిర్వహించి, ఘనంగా సన్మానించారు.

### 18 ఏళ్ల ప్రస్థానానికి దక్కిన గౌరవం

జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం భీంరాజ్‌పల్లి గ్రామానికి చెందిన బొమ్మెన కుమార్, 2008లో సాక్షి దినపత్రిక ప్రారంభం నుంచి గత 18 ఏళ్లుగా సుదీర్ఘకాలం పాటు పాత్రికేయుడిగా విశేష సేవలందిస్తున్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిరంతరం ముందుంటూ, పత్రికా విలువలకు కట్టుబడి పనిచేస్తున్న ఆయన సేవలను గుర్తించిన సాక్షి యాజమాన్యం ఈ ఎక్సలెన్స్ అవార్డుతో సత్కరించింది.

### బాధ్యతను మరింత పెంచింది: బొమ్మెన కుమార్

సన్మాన అనంతరం బొమ్మెన కుమార్ మాట్లాడుతూ.. 18 ఏళ్ల సుదీర్ఘ జర్నలిజం ప్రస్థానంలో ఈ పురస్కారం దక్కడం ఎంతో సంతృప్తిని, గర్వాన్ని ఇచ్చిందన్నారు. క్షేత్రస్థాయిలో తాను చేస్తున్న పనితీరును గుర్తించి ప్రోత్సహించిన సాక్షి యాజమాన్యానికి, ఎడిషన్ ఇన్‌ఛార్జ్ ముజాఫర్, బ్యూరో ఇన్‌ఛార్జ్ అనిల్ కుమార్, డెస్క్ ఇన్‌ఛార్జ్ సంతోష్ కుమార్, సబ్ ఎడిటర్లతో పాటు నిరంతరం వెన్నంటి నిలుస్తున్న తోటి పాత్రికేయ మిత్రులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ పురస్కారం తనపై మరింత బాధ్యతను పెంచిందని, రాబోయే రోజుల్లో ప్రజా సమస్యల పరిష్కారం కోసం మరింత నిబద్ధతతో పనిచేస్తానని స్పష్టం చేశారు.ఘన సన్మానం.. వెల్లువెత్తిన అభినందనలు నిర్వహించిన కార్యక్రమంలో తోటి పాత్రికేయ మిత్రులు బొమ్మెన కుమార్‌ను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కుమార్ కు ప్రతిష్టాత్మక అవార్డు దక్కడంపై నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల ముఖ్య నాయకులు, అధికారులు, ప్రజాసంఘాల నేతలు హర్షం వ్యక్తం చేస్తూ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కచ్చు కొమురయ్య,చిర్ర దిలీప్ ,నర్సాపురం రవీందర్, పొలాస గంగాధర్, భోజనపు శ్రీనివాస్,బోడుగం గంగాధర్, పాత్రికేయులు చౌటపెల్లి తిరుపతి,అంకం భూమయ్య, ఎండి ఖాజానియా, ముస్కు అభిషేక్ రెడ్డి, జంగిలి సత్యం, పొన్నం స్వామి,మండల ప్రింట్, మీడియా ప్రతి నిధులు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రమజీవులకు ప్రత్యేక కేటగిరీ గుర్తింపు ఇవ్వాలి

### భవానీనగర్ నుంచి శ్రమజీవుల యాత్ర ప్రారంభం



**జగిత్యాల, సెప్టెంబర్ 11 (ప్రజా మంటలు):** శ్రమజీవులను ప్రత్యేక కేటగిరీగా గుర్తించి, వారి వృత్తుల వారీగా సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేయాలని శ్రమజీవుల ఐక్య పోరాట సమితి డిమాండ్ చేసింది. ఈ డిమాండ్ల సాధన కోసం చేపట్టిన యాత్రను గురువారం భవానీనగర్ నుంచి ప్రారంభించారు.సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.జె. దేవవరం, సమన్వయ కమిటీ నాయకుడు కేతిరెడ్డి రమణారెడ్డి మాట్లాడుతూ శ్రమజీవులు సమాజంలోని అన్ని వర్గాలకు సేవలందిస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నప్పటికీ ప్రభుత్వపరంగా తగిన గుర్తింపు, రక్షణ లభించడం లేదన్నారు. శ్రమకు తగిన వేతనాలు లేకపోవడంతో పాటు పనిలో భద్రత లేక అనేక మంది ప్రమాదకర పరిస్థితుల్లో పనిచేస్తున్నారని తెలిపారు.శ్రమజీవుల స్థితిగతులపై సమగ్ర సర్వే నిర్వహించి, వారి సమస్యలపై ప్రభుత్వానికి సిఫారసులు చేసేందుకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని వారు కోరారు. నెలకు రూ.2 వేల భృతి, ప్రతి మండల కేంద్రంలో లేబర్ కార్యాలయాల ఏర్పాటు, ఆరోగ్య--ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల్లో కోఆప్షన్ సభ్యులుగా, శాసనసభలో ఎమ్మెల్సీలుగా శ్రమజీవుల ప్రతినిధులకు అవకాశం కల్పించాలని కోరారు.పట్టణ ఉపాధి చట్టాన్ని తీసుకువచ్చి కూలీలకు నిరంతరం ఉపాధి కల్పించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.భవానీనగర్ నుంచి ప్రారంభమైన యాత్ర ధర్మపురి, బుగ్గారం, వెల్గటూర్, ఎండపల్లి, రామగుండం, గోదావరిఖని, జన్నారం, దండేపల్లి, లక్షెట్టిపేట, హాజీపూర్ మీదుగా మంచిర్యాల వరకు కొనసాగుతుందని నాయకులు తెలిపారు.కార్యక్రమంలో కమలాకర్, మునీష్, రంజిత్, లక్ష్మణ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## మహంకాళి జిల్లా బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా వై. సురేష్



**సికింద్రాబాద్, సెప్టెంబర్ 11 (ప్రజా మంటలు):** భారతీయ జనతా పార్టీ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా వై. సురేష్ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షుడు గుండగోని భరత్ గౌడ్, రాజ్యసభ సభ్యులు డాక్టర్ కే లక్ష్మణ్ తో కలిసి శుక్రవారం అధికారిక నియామక పత్రాన్ని జారీ చేశారు.పార్టీ సిద్ధాంతాలు, ఆదర్శాలకు కట్టుబడి నీతి, నిజాయితీ, క్రమశిక్షణతో పనిచేస్తూ సంస్థాగత బలోపేతానికి సురేష్ కుమార్ కృషి చేయాలని భరత్ గౌడ్ ఆకాంక్షించారు. పార్టీ కార్యకర్తలు, వివిధ కమిటీలతో సమన్వయం చేసుకుంటూ స్థానిక ప్రజా సమస్యలపై పోరాటాలు చేసి పార్టీని అన్ని వర్గాల్లోకి విస్తరింపజేయాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడికి పార్టీ శ్రేణులు శు భాకాంక్షలు తెలియజేశాయి. ఈ నియామక సమాచార ప్రతులను కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, ఎంపీ డా. కె. లక్ష్మణ్, స్టేట్ బిజెపి చీఫ్ ఎన్. రాంచందర్ రావు తదితర పార్టీ ముఖ్య నాయకులకు పంపించారు.

## మాజీ సర్పంచులకు రూ.10 వేల పెన్షన్ ఇవ్వాలి

### మెనిఫెస్టో హామీలు అమలు చేయకపోతే ఉద్యమిస్తాం: బొడ్డు దేవయ్య



**జగిత్యాల, సెప్టెంబర్ 11 (ప్రజా మంటలు):** 2023 ఎన్నికల మేనిఫెస్టోలో మాజీ సర్పంచులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం మూడేళ్లుగా అమలు చేయడం లేదని తెలంగాణ మాజీ సర్పంచుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొడ్డు దేవయ్య విమర్శించారు. శుక్రవారం జగిత్యాల ప్రెస్‌క్లబ్‌లో జిల్లా స్థాయి మాజీ సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.మాజీ సర్పంచులందరికీ నెలకు రూ.10 వేల పెన్షన్, కుటుంబ సభ్యులకు హెల్త్ కార్డుల ద్వారా కార్పొరేట్ వైద్యం, ఉచిత బస్‌పాస్, అర్హులకు ఇళ్ల మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మాజీ సర్పంచులకు ఓటు హక్కు కల్పించాలని కోరారు.ఐదేళ్ల పాటు గ్రామాలకు సేవలందించిన మాజీ సర్పంచులను ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని జిల్లా అధ్యక్షుడు మచ్చ నారాయణ అన్నారు. డిమాండ్లు నెరవేర్చకపోతే రాష్ట్రంలోని మాజీ సర్పంచులందరినీ ఏకం చేసి సంఘటితంగా ఉద్యమిస్తామని దేవయ్య హెచ్చరించారు.సర్పంచ్ ఎన్నికలను ఐదేళ్లు పూర్తికాగానే నిర్వహించి, నూతన సర్పంచులకు వెంటనే బాధ్యతలు అప్పగించాలని జిల్లా అధికార ప్రతినిధి ఎన్నం కిషన్‌రెడ్డి కోరారు. గ్రామాభివృద్ధి నిధులు దారి మళ్లించకుండా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.జిల్లా ప్రధాన కార్యదర్శి దుమ్మని బాల ముకుందం మాట్లాడుతూ మాజీ సర్పంచుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. జిల్లాలో మండల స్థాయి కమిటీలు ఏర్పాటు చేసి సంఘాన్ని మరింత పటిష్టం చేస్తామని పలువురు మాజీ సర్పంచులు తెలిపారు.సమావేశంలో మాజీ సర్పంచులు బుర్ర మల్లేశం కె.గౌడ్, మర్రిపెల్లి నారాయణ గౌడ్, అంకతి గంగాధర్, పత్తిరెడ్డి మహిపాల్‌రెడ్డి, ముదిగొండ శేఖర్, జక్కుల తిరుపతి, కొత్తపేట సాయగౌడ్, జంగా గంగస్వామి, ఎండీ సలీం, మోహన్‌రావు, మారు రాజేశ్వర్‌రెడ్డి, సామల్ల లావణ్య వేణు, దమ్మా లతశ్రీ నర్సింగం, జిల్లాపెల్లి శారద గంగారాం, లైసెటి లక్ష్మీరాజు, అల్లంకొండ సుదర్శన్, నాంబారి కిషన్, కైరి ముత్యం గౌడ్, అంజగౌడ్, నరేందర్, రెబ్బాస్ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.ద

## లోకమాత పోచమ్మ ఆలయంలో మున్సిపల్ ఛైర్పర్సన్ పూజలు



**జగిత్యాల జిల్లా ప్రతినిధి, ( ప్రజా మంటలు) సెప్టెంబర్ 11:** జగిత్యాల పురానిపేటలోని లోకమాత పోచమ్మ తల్లి ఆలయంలో జగిత్యాల మున్సిపల్ ఛైర్పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. లోకమాత పోచమ్మ తల్లి ఆశీస్సులతో పట్టణ ప్రజలు శుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.ఆలయం పక్షాన ఛైర్పర్సన్ దంపతులను ఘనంగా సన్మానించారు.స్థానిక కౌన్సిలర్ గాజుల లావణ్య మహేష్,ఆలయ కమిటీ సభ్యులు మాజీ కౌన్సిలర్ గాజుల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్కతుర్తి విశాల సహకార సంఘానికి ఎన్నికలు ఎందుకు నిర్వహించలేదు? నామినేటెడ్ పాలన ఎందుకు?



**ఎల్కతుర్తి సెప్టెంబర్ 11 ప్రజా మంటలు :** ఎన్నికలు లేకుండానే చైర్మన్, డైరెక్టర్లను నియమించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధం కాదా? అని బీజేపీ ఎల్కతుర్తి మండల అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.ఎల్కతుర్తి విశాల సహకార సంఘం రైతుల ప్రయోజనాలకు సంబంధించిన కీలకమైన సంస్థ అని, అలాంటి సంస్థలో రైతులకు తమ ప్రతినిధులను ఎన్నుకునే అవకాశం లేకుండా అధికార పార్టీకి చెందిన నాయకులను నామినేటెడ్ పద్ధతిలో చైర్మన్, డైరెక్టర్లుగా నియమించడం వెనుక ఉద్దేశం ఏమిటో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.సొసైటీలో సుమారు ?3.20 కోట్ల మేర నిధులు ఉన్నాయని చెబుతున్న నేపథ్యంలో, ఆ నిధులు, సొసైటీ ఆస్తులు, రైతుల ప్రయోజనాలకు పూర్తి భద్రత ఉంటుందా? అనే ఆందోళన రైతుల్లో నెలకొందన్నారు.గతంలో సొసైటీకి సంబంధించిన అవకతవకలు, ఆర్థిక వ్యవహారాలపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో, వాటిపై పూర్తి స్థాయిలో విచారణ జరిగిందా? ప్రస్తుతం సొసైటీ ఆర్థిక పరిస్థితి ఏమిటి? నిధులు, ఆస్తుల వివరాలను రైతులకు బహిరంగంగా వెల్లడిస్తారా? అని శ్రీకాంత్ యాదవ్ ప్రశ్నించారు.

ఎన్నికలను ఎదుర్కొని రైతుల తీర్పు పొందే ధైర్యం కాంగ్రెస్ నాయకులకు లేదా?

ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు నిర్వహిస్తే రైతులు ఎవరిని ఎన్నుకోవాలో వారే నిర్ణయిస్తారని, కానీ ఎన్నికలు లేకుండా నామినేషన్ల ద్వారా పదవులు కట్టబెట్టడం వల్ల సహకార సంఘాల స్వయం ప్రతిపత్తి, ప్రజాస్వామ్య స్ఫూర్తి దెబ్బతినే ప్రమాదం ఉందని అన్నారు.

సహకార సంఘాలు రైతుల కోసం ఉండాలి... అధికార పార్టీ నాయకులకు రాజకీయ పునరావాస కేంద్రాలుగా మారకూడదు.

ఎల్కతుర్తి విశాల సహకార సంఘాన్ని ఇన్ని సంవత్సరాలుగా కంటికి రెప్పలా కాపాడుకున్న రైతులు, సభ్యుల ప్రయోజనాలను పక్కనపెట్టి రాజకీయ నియామకాలు చేయడం సరైన విధానం కాదన్నారు.అధికారంలో ఉన్న వారు సొసైటీ నిధులు, ఆస్తులు, ఆర్థిక లావాదేవీలపై పూర్తి పారదర్శకత పాటించాలని, రైతులకు అన్ని వివరాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు.ఎల్కతుర్తి సొసైటీ రైతులదే... ఏ ఒక్క రాజకీయ పార్టీకి చెందిన వ్యక్తుల సొంత ఆస్తి కాదు.కాబట్టి వెంటనే ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించి, రైతులు తమ ప్రతినిధులను తామే ఎన్నుకునే అవకాశం కల్పించాలని బీజేపీ తరఫున డిమాండ్ చేస్తున్నామని శ్రీకాంత్ యాదవ్ తెలిపారు.లిలి"నామినేటెడ్ పాలన వద్దు...రైతుల చేత ఎన్నుకోబడిన పాలన కావాలి!"

## సహకార సంఘాలను నిర్వీర్యం చేసేందుకు కుట్ర చేసిన కాంగ్రెస్

### సింగిల్ విండో మాజీ చైర్మన్ శ్రీపతి రవీందర్ గౌడ్



**ఎల్కతుర్తి సెప్టెంబర్ 11: ప్రజా మంటలు :** ఎల్కతుర్తి బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు పిట్టల మహేందర్ ఆధ్వర్యంలో ప్రెస్ మీట్

ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ సహకార సంఘం ఎన్నికలను నిర్వహించకుండా ప్రభుత్వం నామినేషన్ పద్ధతిని నిర్వహిస్తుందని అన్నారు తక్షణమే ఎన్నికలు నిర్వహించి రైతుల ఆమోదయోగ్యమైన ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు .అనంతరం సింగిల్ విండో మాజీ చైర్మన్ శ్రీపతి రవీందర్ గౌడ్ మాట్లాడుతూ..సహకార సంఘాలు రైతుల వాటాదనంతోని ఏర్పాటు చేసుకున్నారు వ్యవసాయ అవసరాల నిమిత్తం ఫెర్టిలైజర్స్ పెట్టి సైడ్స్ వ్యవసాయ రుణాలు తీసుకొనుటకు వ్యవసాయదారులు అందరూ కలిసి 13 మంది డైరెక్టర్లను ఓట్ల ద్వారా ఎన్నుకుంటారు ఆ కమిటీ ద్వారా సంఘాన్ని ఐదు సంవత్సరాలు నడిపిస్తారు ఈ సంఘంలో ప్రభుత్వం నుండి ఎలాంటి పెట్టుబడులు ఉండవు సంఘాల మీద ఆజమాయిషి మాత్రమే ప్రభుత్వానికి ఉంటుంది.ఎల్కతుర్తి సహకార సంఘం 2020 సంవత్సరంలో నష్టాల బాటలో ఉంది 2020లో రైతులు ద్వారా ఎన్నుకోబడిన పాలకవర్గం 2025 వరకు లాభాల బాటలో సంఘాన్ని తీసుకురావడం జరిగింది దాదాపు సంఘంలో మూడు కోట్ల డిపాజిట్ చేయడం జరిగింది లాభాల బాటలో ఉన్న సంఘ సభ్యులకు నాలుగు శాతం పర్సంటేజ్ బోనస్ గా ఇవ్వడం జరిగింది అడిగిన ప్రతి రైతుకు వ్యవసాయ రుణం ఇవ్వడం జరిగింది అని అన్నారు.సహకార చట్టం ప్రకారం ఐదు సంవత్సరాలకు ఒకసారి ఎన్నికలు జరపాలి పార్టీలకు అతీతంగా ఎన్నికలు జరగాలి కానీ నామినేషన్ పద్ధతి లేదు కాంగ్రెస్ ప్రభుత్వం ఓట్ల ద్వారా రైతుల మద్దతుతో గెలవలేని పరిస్థితి ఏర్పడినందున అడ్డదారిలో నామినేషన్ పద్ధతి ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం తమ నాయలకు పదవులు ఇచ్చుకున్నారు కానీ నామినేషన్ పద్ధతి లేదు కాంగ్రెస్ ప్రభుత్వం సహకార చట్ట విరుద్ధంగా రైతులతోని ఎన్నికలు జరపకుండా నామినేషన్ పద్ధతితో నియమించడం రైతు వ్యతిరేక నిర్ణయం రైతులు ఆవేదన చెందుతున్నారు కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేకంగా నామినేషన్ పద్ధతి తీసుకురావడం సంఘాలను నిర్వీర్యం చేయడం మంచి పరిణామం కాదు అన్నారు సహకార సంఘాల్లో ఎలాంటి రాజకీయ పార్టీల ప్రమేయం ఉండకూడదు తక్షణమే సహకార సంఘాలకు ఎన్నికలు జరపాలని ప్రభుత్వాన్ని రవీందర్ గౌడ్ డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ మునిగడప శేషగిరి మాజీ మండల పార్టీ అధ్యక్షులు యేల్తూరి స్వామి మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ తంగేడ మహేందర్ మాజీ వైస్ ఎంపీపీ తంగెడ నగేష్ మాజీ ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షులు కడారి రాజు బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గొల్లె మహేందర్ మండల మండల ప్రధాన కార్యదర్శి జూపాక జడ్సన్ హుస్నాబాద్ నియోజకవర్గ బిఆర్ఎస్వి ఉపాధ్యక్షులు గోడిశాల వినయ్ కుమార్ గౌడ్ సొసైటీ మాజీ డైరెక్టర్లు కాగితాల శ్రీనివాస్ రాజిరెడ్డి సమ్మయ్య పోచయ్య.సీనియర్ నాయకులు మదన్ మోహన్ రావు కోరే రాజకుమార్ బొంకురి కార్తీక్ భగవాన్ గౌడ్ రాజు రవి తదితరులు పాల్గొన్నారు

# పోలవరంలోకి పెద్దపులి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన

**ఏలేశ్వరం సెక్షన్‌లోని పెద్దిపాలెం బీట్‌లో ఒక పులి సంచరిస్తున్నట్లు గుర్తించారు.**

**రేడియో కాలర్ ద్వారా ఉలిగోగుల రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో దాని కదలికలను గుర్తించారు.**

**చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.**



కాకినాడ జిల్లా ఏలేశ్వరం సెక్షన్ పరిధిలోని పెద్దిపాలెం బీట్‌లోకి ఒక పులి ప్రవేశించడంతో అటవీ శాఖ హై అలర్ట్ ప్రకటించింది. పులికి అమర్చిన రేడియో కాలర్ ద్వారా ఉలిగోగుల రిజర్వ్ ఫారెస్ట్‌లో దాని ఉనికిని అధికారులు గుర్తించారు. ఈ వన్యప్రాణి కదలికలను నిరంతరం పర్యవేక్షించడానికి ప్రత్యేక 'హనుమాన్ రెస్క్యూ బృందాలు' రంగంలోకి దిగాయి. ధారపల్లి, బురదకోట, మిర్తివాడ, బావురువాక, తడువాయి గ్రామాల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. అలాగే ధారపల్లి జలపాతం ప్రాంతంలోకి ప్రవేశాన్ని పూర్తిగా నిషేధించారు.ఏలేశ్వరం అటవీ ప్రాంతంలోకి అకస్మాత్తుగా ఒక అడవి పులి ప్రవేశించడం కాకినాడ జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో కలకలం రేపింది. పులికి అమర్చిన రేడియో కాలర్ పని చేస్తూ ఉండటంతో, ఉలిగోగుల రిజర్వ్ ఫారెస్ట్ లోపలి భాగంలో దాని కదలికలు గుర్తించినట్లు అటవీ అధికారులు ధృవీకరించారు. ట్రాకింగ్ డేటా ప్రకారం పులి పెద్దిపాలెం బీట్ ప్రాంతానికి చేరుకుంది. దీంతో దాని కదలికలను గమనించడానికి వన్యప్రాణి పర్యవేక్షణ బృందాలను వెంటనే రంగంలోకి దించారు.ప్రజల భద్రతను కాపాడటానికి, మనుషులు-జంతువుల మధ్య సంఘర్షణను నివారించడానికి, అటవీ శాఖ నిపుణులైన 'హనుమాన్ రెస్క్యూ బృందాలను' రంగంలోకి దించింది. అత్యాధునిక ట్రాకింగ్ పరికరాలతో కూడిన ఈ ప్రత్యేక బృందాలు ప్రస్తుతం రిజర్వ్ ఫారెస్ట్ సరిహద్దు ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపడుతున్నాయి. పులి ఎక్కడ ఉందో నిరంతరం గమనించడానికి, అది జనావాసాల్లోకి రాకుండా చూడటానికి రాత్రిపూట గస్తీని, కెమెరా-ట్రాప్ పర్యవేక్షణను ముమ్మరం చేశారు. ధారపల్లి, బురదకోట, మిర్తివాడ, బావురువాక, తడువాయి వంటి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు రాత్రిపూట ఇళ్లకే పరిమితం కావాలని, ఒంటరిగా పొలాలకు వెళ్లవద్దని అటవీ అధికారులు అధికారికంగా హెచ్చరించారు. అంతేకాకుండా ముందస్తు భద్రతా చర్యగా, పులి ఆ ప్రాంతం నుంచి సురక్షితంగా వెళ్లిపోయే వరకు ప్రసిద్ధ ధారపల్లి జలపాతం ప్రాంతానికి పర్యాటకుల రాకపోకలపై కఠిన నిషేధం విధించారు. ప్రజలు సహకరించాలని, పులి అడుగుజాడలు లేదా దాని ఉనికికి సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే తెలియజేయాలని అధికారులు కోరారు.

# మా జుట్టు పట్టుకుని లాగారు: ఢిల్లీలో ఎన్‌హెచ్‌ఆర్సీకి సబితాఇంద్రారెడ్డి ఫిర్యాదు

**అసెంబ్లీ ఘటనపై ఎన్‌హెచ్‌ఆర్‌సీకి ఫిర్యాదు చేసిన బీఆర్ఎస్**

**మహిళా ఎమ్మెల్యేల జుట్టు పట్టుకుని లాగారని ఆరోపణ**

**ఇది కుట్రలో భాగమేనని సబితా ఇంద్రారెడ్డి వ్యాఖ్య**

**డీజీపీకి ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యమని ఆవేదన**



తెలంగాణ అసెంబ్లీ ప్రాంగణంలో తమపై జరిగిన దాడి జరిగిందని, అవమానకరకరమైన ప్రవర్తన ఎదురైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ జాతీయ మానవ హక్కుల కమిషన్‌ను (ఎన్ హెచ్ ఆర్ సీ) ఆశ్రయించింది. బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి నేతృత్వంలోని మహిళా ఎమ్మెల్యేల బృందం శుక్రవారం ఢిల్లీలో ఎన్‌హెచ్‌ఆర్‌సీ సభ్యురాలు విజయభారతిని కలిసి ఫిర్యాదును అందజేసింది.ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. అసెంబ్లీ వద్ద పోలీసులు తమ పట్ల అత్యంత అమానుషంగా ప్రవర్తించారని ఆరోపించారు. "మహిళా ఎమ్మెల్యేల జుట్టు పట్టుకుని లాగుతూ పోలీసులు అరాచకం సృష్టించారు. ఇదంతా ఒక పథకం ప్రకారం, కుట్రలో భాగంగానే జరిగింది" అని ఆమె పేర్కొన్నారు. తమను రక్షించేందుకు ప్రయత్నించిన తోటి ఎమ్మెల్యేలను సైతం పోలీసులు తోసివేసి కిందపడేసి తొక్కారని, ఈ ఘటనలో జగదీశ్‌రెడ్డికి రక్తపోటు పెరిగిందని, పలువురు ప్రజాప్రతినిధులకు గాయాలయ్యాయని వివరించారు.ఘటన జరిగి మూడు రోజులు గడుస్తున్నా, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరినప్పటికీ ప్రభుత్వం స్పందించలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర డీజీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతోనే జాతీయ మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించాల్సి వచ్చిందని తెలిపారు. అసెంబ్లీలోకి వెళ్లకుండా తమను అడ్డుకునే అధికారం పోలీసులకు ఎవరిచ్చారని ఆమె ప్రశ్నించారు. ఈ ఘటనపై తక్షణమే విచారణ జరిపి, బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు తమ ఫిర్యాదులో కోరారు.

# బంగాళాఖాతంలో అల్పపీడనం ఏపీలో మూడు రోజుల పాటు భారీ వర్షాలు!

**వాయవ్య, పశ్చిమమధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం**

**ఉత్తరాంధ్ర జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్ష సూచనలు**

**మిగతా జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందన్న విపత్తుల నిర్వహణ సంస్థ**

**వాయవ్య, పశ్చిమమధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం**



బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం దక్షిణ ఒడిశా ఉత్తరాంధ్ర తీర ప్రాంతాల్లో కేంద్రీకృతమైంది. రానున్న మూడు రోజుల పాటు ఉత్తరాంధ్రలో మోస్తరు నుంచి భారీ వర్షాలు, దక్షిణ కోస్తాలో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఉత్తర కోస్తా తీరం వెంబడి గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. పోలవరం, విశాఖ, అనకాపల్లి, కాకినాడ, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. మిగతా జిల్లాల్లో తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. సముద్రం అల్లకల్లోలంగా ఉంటూ అలలు ఎగిసిపడే అవకాశం ఉన్నందున మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని హెచ్చరించారు.మత్స్యకారులు వేటకు వెళ్లొద్దు బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం దక్షిణ ఒడిశా-ఉత్తరాంధ్ర తీర ప్రాంతాల్లో కేంద్రీకృతం కావడంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. రానున్న మూడు రోజుల పాటు ఉత్తరాంధ్ర, దక్షిణ కోస్తాలో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఎలాంటి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని హోంమంత్రి అనిత అధికారులను ఆదేశించారు. వర్ష ప్రభావిత జిల్లాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి, వాతావరణ హెచ్చరికలను ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేయాలని సూచించారు. తీర ప్రాంతాల్లో గంటకు 50 నుంచి 70 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లొద్దని హోంమంత్రి అనిత సూచించారు.కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు బంగాళాఖాతంలో అల్పపీడనం దృష్ట్యా మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లొద్దని మంత్రి అచ్చెన్నాయుడు సూచించారు. వాతావరణ శాఖ హెచ్చరికలను దృష్టిలో ఉంచుకుని ఇప్పటికే వేటకు వెళ్లిన మత్స్యకారులు వెంటనే తీరానికి చేరుకుని సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని విజ్ఞప్తి చేశారు. తీరప్రాంతాల్లో పరిస్థితిని అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. మత్స్యకారుల ప్రాణభద్రతే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని, అధికారులు ఇచ్చే సూచనలను ప్రతి ఒక్కరూ తప్పక పాటించాలని అచ్చెన్న తెలిపారు. అత్యవసర సహాయం కోసం 112, 1070, 1800 425 0101 నంబర్లను సంప్రదించాలని ప్రభుత్వం తెలిపింది.నీట మునిగిన రహదారులు విజయవాడలో గురువారం సాయంత్రం 40 నిమిషాల పాటు భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రహదారులు నీట మునగడంతో వాహనదారులు రాకపోకలు సాగించడానికి తీవ్ర అవస్థలు పడ్డారు. శ్రీకాకుళం జిల్లావ్యాప్తంగా రాత్రి నుంచి ఏకధాటిగా వర్షం కురుస్తోంది. దీంతో మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది.

# పశ్చిమ బెంగాల్ బొగ్గు కుంభకోణంలో ఈడీ మెరుపు దాడులు.. హైదరాబాద్ ఏఎంఆర్ సంస్థ కార్యాలయాల్లో సోదాలు

**1బొగ్గు కుంభకోణం, అక్రమ నిధుల మళ్లింపు కేసులో ఈడీ సోదాలు**

**హైదరాబాద్‌తో పాటు ఢిల్లీ, కోల్‌కతా, ఝార్ఖండ్ రాష్ట్రాల్లోని పలు ప్రదేశాల్లో ఏకకాలంలో తనిఖీలు**

**ఐదేళ్లలో బొగ్గు సిండికేట్ రూ. 650 కోట్లకు పైగా ఆర్జించిందని ఆరోపణలు**




పశ్చిమ బెంగాల్‌లో కలకలం రేపిన భారీ బొగ్గు కుంభకోణం, అక్రమ నిధుల మళ్లింపు కేసుకు సంబ ంధించి ఈడీ అధికారులు దేశవ్యాప్తంగా ఏకకాలంలో సోదాలు చేపట్టారు. ఇందులో భాగంగా హైదరాబాద్‌లోని ప్రముఖ ఏఎంఆర్ గ్రూప్ సంస్థ కార్యాలయాలు, దానికి సంబంధించిన కీలక వ్యక్తుల నివాసాలలో ఈడీ అధికారులు మెరుపు తనిఖీలు నిర్వహించడం రాజకీయ, వ్యాపార వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది.హైదరాబాద్‌తో పాటు ఢిల్లీ, కోల్‌కతా, ఝార్ఖండ్ రాష్ట్రాల్లోని పలు ప్రదేశాల్లో ఏకకాలంలో తనిఖీలు చేపట్టారు. బొగ్గు గనుల మైనింగ్, ప్రాజెక్టులు, నిధుల మళ్లింపు కోణంలో కీలక పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకుంటున్నారు. ఝార్ఖండ్ నుండి పశ్చిమ బెంగాల్‌లోని దుర్గాపూర్-అసన్సోల్ ప్రాంతానికి అక్రమంగా బొగ్గును తరలిస్తూ, డెలివరీ ఆర్డర్ హోల్డర్లు, ట్రాన్స్‌పోర్టర్ల నుండి గుండా టాక్స్, రంగదారి పన్నుల పేరుతో బొగ్గు సిండికేట్ గత ఐదేళ్లలో ఏకంగా రూ.650 కోట్లకు పైగా 'ప్రొసీడ్స్ ఆఫ్ క్రైమ్' (నేరపూరిత రాబడి) ఆర్జించిందని ఈడీ ప్రాథమికంగా నిర్ధారించింది.పశ్చిమ బెంగాల్ అక్రమ కోల్ మైనింగ్ వ్యవహారంలో ప్రత్యేక కోర్టులో ఈడీ ఇప్పటికే ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. ప్రధానంగా అరెస్టయిన చిన్మయ్ మొండల్, కిరణ్ ఖాన్‌లతో పాటు మరో ముగ్గురి పేర్లను అందులో చేర్చారు. అక్రమ రవాణా నిరాటంకంగా సాగేందుకు స్థానిక రాజకీయ ప్రముఖులు, కొందరు ప్రభుత్వ అధికారులకు భారీగా లంచాలు చెల్లించినట్లు విచారణలో తేలింది.

# చిన్నారుల్లో పెరుగుతున్న అధిక బరువు, ఊబకాయం రోజూ గంట వ్యాయామం తప్పనిసరంటున్న కిమ్స్ వైద్యులు

రాష్ట్రంలో చిన్నారులలో అధిక బరువు, ఊబకాయం పెరుగుతోంది. ఫలితంగా చిన్న వయసులోనే బీపీ, మధుమేహం, కాలేయ సమస్యలను ఎదుర్కొంటున్నారని కిమ్స్ వైద్యులు హెచ్చరిస్తున్నారు. రోజూ శారీరక శ్రమ, మానసిక ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని సూచించారు.ఒకప్పుడు చిన్నారుల్లో పోషకాహార లోపం, తక్కువ బరువు ప్రధాన సమస్యలుగా ఉండేవి. ఇప్పుడు పరిస్థితి మారుతోంది. అధిక బరువు, ఊబకాయం కూడా చిన్నారులను వేధిస్తున్నాయి. తెలంగాణలో చిన్నారుల ఊబకాయం గణనీయంగా పెరిగింది. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-4లో 0.7 శాతంగా ఉన్న చిన్నారుల ఊబకాయం ఎన్ఎఫ్‌హెచ్ఎస్-5లో 3.4 శాతానికి చేరింది. హైదరాబాద్ వంటి పట్టణ ప్రాంతాల్లో పాఠశాలలకు వెళ్లే పిల్లల్లో అధిక బరువు, ఊబకాయం కలిపి 20 నుంచి 35 శాతం వరకు ఉన్నట్లు వివిధ అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి.

**దేశవ్యాప్తంగా రెండు రకాల పోషక సమస్యలు**

భారత్‌లో 4.1 కోట్లకు పైగా పిల్లలు అధిక బరువు లేదా ఊబకాయంతో ఉన్నట్లు అంచనాలు ఉన్నాయి. మరోవైపు ఇప్పటికీ అనేక ప్రాంతాల్లో పోషకాహార లోపం, ఎదుగుదల లోపం కొనసాగుతున్నాయి. అంటే ఒకవైపు పోషకాహార లోపం ఉంటూనే మరోవైపు అధిక బరువు సమస్య పెరుగుతోంది. దీనినే 'డబుల్ బర్డెన్'గా పేర్కొంటున్నారు. ఇళ్లలో సంప్రదాయ ఆహారానికి బదులుగా అధిక చక్కెర, ఉప్పు, కొవ్వు కలిగిన ప్యాకేజ్డ్ ఆహార పదార్థాలు, శుద్ధి చేసిన పిండి పదార్థాలు, చిప్స్, నూడుల్స్, తీపి పానీయాల వినియోగం పెరుగుతోంది. ఇవి పిల్లల ఆహారపు అలవాట్లను ప్రభావితం చేస్తున్నాయి.

**తెలంగాణలో వేగంగా పెరుగుతున్న సమస్యం**

2015-16లో జరిగిన ఎన్ఎఫ్‌హెచ్ఎస్-4తో పోలిస్తే 2019-21లో జరిగిన ఎన్ఎఫ్‌హెచ్ఎస్-5లో తెలంగాణలో చిన్నారుల ఊబకాయం 0.7 శాతం నుంచి 3.4 శాతానికి పెరిగింది. అంటే 2.7 శాతం పాయింట్ల పెరుగుదల నమోదైంది. దేశంలో చిన్నారుల ఊబకాయం ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణ ఎనిమిదో స్థానంలో ఉన్నట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. పెద్దల్లో అధిక బరువు, ఊబకాయం కూడా ఆందోళన కలిగించే స్థాయిలో ఉంది. ఐసీఎంఆర్-ఎన్ఐఎన్ అధ్యయనం ప్రకారం తెలంగాణలో 47.7 శాతం మంది పెద్దలు అధిక బరువు లేదా ఊబకాయంతో ఉన్నారు. తల్లిదండ్రుల జీవనశైలి, ఆహారపు అలవాట్లు పిల్లలపై కూడా ప్రభావం చూపుతున్నాయి. అదే సమయంలో కొన్ని ప్రాంతాల్లో రక్తహీనత వంటి సూక్ష్మ పోషక లోపాలు కొనసాగుతుండగానే కౌమారదశ పిల్లల్లో బీఎంఐ పెరుగుతోంది. దీంతో బరువు ఎక్కువగా ఉన్నంత మాత్రాన పోషకాహారం సరిపోతున్నట్లు కాదు అనే విషయాన్ని గుర్తించాల్సిన అవసరం ఉంది.

**ఊబకాయానికి కేంద్రంగా హైదరాబాద్!**




వేగవంతమైన పట్టణీకరణ, మారుతున్న జీవనశైలి, ఇంటి వద్దే ఎక్కువ సమయం గడపడం, ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ, జంక్‌ఫుడ్ సులభంగా అందుబాటులో ఉండటం వంటి కారణాలతో హైదరాబాద్‌లో చిన్నారుల్లో అధిక బరువు సమస్య పెరుగుతోంది. ప్రైవేటు పాఠశాలల్లో నిర్వహించిన కొన్ని అధ్యయనాల్లో ఐఏపీ ప్రమాణాల ప్రకారం ఊబకాయం, అధిక బరువు కలిపి గణనీయమైన స్థాయిలో నమోదయ్యాయి. ప్రభుత్వ, సెమీ అర్బన్ పాఠశాలల్లోనూ ఈ సమస్య 19 నుంచి 21 శాతం వరకు ఉన్నట్లు అధ్యయనాలు పేర్కొంటున్నాయి. దీంతో ఇది కేవలం సంపన్న కుటుంబాల పిల్లల సమస్య కాదని స్పష్టమవుతోంది. గచ్చిబౌలి, మియాపూర్, మాదాపూర్ వంటి అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లోనూ పిల్లల్లో శారీరక చురుకుదనం తగ్గుతోంది. చదువుల ఒత్తిడి, ఇంట్లోనే ఎక్కువ సమయం గడపడం, ఆట స్థలాలు అందుబాటులో లేకపోవడం, స్క్రీన్ వినియోగం పెరగడం ఇందుకు కారణాలుగా నిపుణులు చెబుతున్నారు.

**'ఇద్దరు ముగ్గురిలో ఒకరికి అధిక బరువు'**

హైదరాబాద్‌లోని పట్టణ, క్లినికల్ పరిస్థితులను పరిశీలిస్తే ప్రతి ఇద్దరు లేదా ముగ్గురు పిల్లల్లో ఒకరు అధిక బరువు లేదా ఊబకాయంతో ఉండటం కనిపిస్తోంది. ఒకప్పుడు పిల్లల్లో పోషకాహార లోపం, ఎదుగుదల సమస్యలపై ప్రధానంగా దృష్టి పెట్టేవాళ్లమని ఇప్పుడు అదే సమయంలో చిన్నారుల్లో ఊబకాయం కూడా వేగంగా పెరుగుతోందని కిమ్స్ వైద్యులు డాక్టర్ బాబు ఎస్. మదార్కర్ పేర్కొన్నారు.అధిక బరువుతో పిల్లల్లో చిన్న వయసులోనే అధిక రక్తపోటు, కొవ్వు కాలేయం, టైప్-2 మధుమేహం వంటి సమస్యలు కనిపిస్తున్నాయి. గతంలో ప్రధానంగా మధ్య వయస్కుల్లో కనిపించిన కొన్ని జీవనశైలి సంబంధిత వ్యాధులు ఇప్పుడు చిన్నారుల్లోనూ గుర్తించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీర్ఘకాలం సెల్‌ఫోన్, టీవీ, ఇతర స్క్రీన్ల ముందు కూర్చోవడం వల్ల శారీరక శ్రమ తగ్గిపోతోందని చెప్పారు. అదే సమయంలో స్క్రీన్ చూస్తూ చిప్స్, నూడుల్స్, బిస్కెట్లు, తీపి పానీయాలు వంటి వాటిని మధ్యమధ్యలో తీసుకోవడం అలవాటవుతోందన్నారు. దీనివల్ల పిల్లల సహజ ఆకలి నియంత్రణ దెబ్బతినడంతో పాటు అధిక కేలరీలు శరీరంలోకి చేరుతున్నాయని వివరించారు.

**కిమ్స్ వైద్యుల సలహాలు**

చిన్నారుల ఊబకాయాన్ని కేవలం ఆహారం తగ్గించడం ద్వారా నియంత్రించలేము.పిల్లల మానసిక ఆరోగ్యం, స్క్రీన్ వినియోగం, శారీరక చురుకుదనం, కుటుంబ సభ్యుల జీవనశైలి అన్నింటిపైనా దృష్టి పెట్టాలి.తల్లిదండ్రులు పిల్లలకు చెప్పడమే కాకుండా తామూ ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించాలి.రోజువారీ శారీరక శ్రమకు సమయం కేటాయించాలి. పాఠశాలల్లోనూ క్రమబద్ధమైన వ్యాయామం, క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని డాక్టర్ బాబు ఎస్. మదార్కర్ చెబుతున్నారు.

**ప్యాకెట్ ఆహారాలపై నియంత్రణ అవసరం**

చిన్నారులకు అధిక చక్కెర, ఉప్పు, కొవ్వు కలిగిన ఆహార పదార్థాలు సులభంగా అందుబాటులో ఉండటం కూడా సమస్యను పెంచుతోంది. ఐసీఎంఆర్-ఎన్ఐఎన్ నేతృత్వంలోని 'లెట్స్ ఫిక్స్ అవర్ ఫుడ్' కార్యక్రమం యువత ఆహార వాతావరణంలో మార్పులు తీసుకురావడానికి పలు సూచనలు చేసింది. ఆహార ప్యాకెట్లపై అధిక చక్కెర, ఉప్పు, కొవ్వు వంటి అంశాలను స్పష్టంగా తెలియజేసే ఫ్రంట్-ఆఫ్-ప్యాక్ న్యూట్రిషన్ లేబులింగ్‌ను అమలు చేయాలని సూచించింది.

**పాఠశాలల్లో జంక్‌ఫుడ్‌కు కళ్లెం**

పాఠశాల ప్రాంగణాల్లో, వాటికి 50 మీటర్ల పరిధిలో అధిక కొవ్వు, చక్కెర, ఉప్పు కలిగిన ఆహార పదార్థాల విక్రయం, ప్రకటనలపై నిబంధనలు ఉన్నాయి. అయితే వీటి అమలుపై మరింత పర్యవేక్షణ అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. పాఠశాలలు 'ఈట్ రైట్ స్కూల్' విధానాన్ని అమలు చేయాలి. క్యాంటీన్లకు అవసరమైన లైసెన్సులు, ఆహార పట్టికలపై ఎప్పటికప్పుడు తనిఖీలు, పోషకాహార నిపుణుల సూచనలు ఉండేలా చూడాలి.

**రోజుకు గంట వ్యాయామం తప్పనిసరి చేయాలి**

చిన్నారులు రోజులో కనీసం 45 నుంచి 60 నిమిషాలు శారీరకంగా చురుకుగా ఉండేలా పాఠశాలలు చర్యలు తీసుకోవాలి. ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల్లోనూ రోజువారీ వ్యాయామం, క్రీడలకు తగిన సమయం కేటాయించాలి. అలాగే నగరాల్లో పిల్లలు ఆడుకునేందుకు సురక్షితమైన ఆటస్థలాలు, నడక మార్గాలు, సైకిల్ ట్రాక్‌లను అభివృద్ధి చేయాలి. వేగంగా అభివృద్ధి చెందుతున్న నివాస ప్రాంతాల్లో ఉన్న బహిరంగ స్థలాలను కాపాడాల్సిన అవసరం ఉంది. చిన్నారుల ఊబకాయాన్ని ఒక వ్యక్తిగత సమస్యగా కాకుండా కుటుంబం, పాఠశాల, సమాజం కలిసి పరిష్కరించాల్సిన ప్రజారోగ్య సమస్యగా చూడాల్సిన అవసరం ఉంది.

# బొల్లారం రెజిమెంట్ కేసులో కీలక పరిణామం చోరీకి గురైన ఆర్మీ ఆయుధాలు స్వాధీనం



బొల్లారం మద్రాస్ రెజిమెంట్ ఆర్మీ ఆయుధాల చోరీ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. చోరీకి గురైన ఆయుధాలను (మ్యాగజైన్స్, బుల్లెట్స్, బైనార్కులర్) ఓ విశ్రాంత ఆర్మీ అధికారి ఇంట్లో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.బొల్లారం మద్రాస్ రెజిమెంట్ ఆర్మీ ఆయుధాల చోరీ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. చోరీకి గురైన ఆయుధాలను (మ్యాగజైన్స్, బుల్లెట్స్, బైనార్కులర్) పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఓ అధికారితో పాటు మరో ఇద్దరిని పోలీసులు విచారణ చేస్తున్నారు. మహబూబ్‌నగర్‌లోని ఓ విశ్రాంత ఆర్మీ అధికారి ఇంట్లో ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. బెల్ ఆఫ్ ఆర్మ్స్ ఇన్‌ఛార్జ్, బుల్లెట్స్ ఇచ్చే అమ్మినిషన్ సెక్షన్ ఇన్‌ఛార్జ్ సహకారంతో చోరీ జరిగినట్లు తెలిసింది.

**ఇద్దరు ఇన్‌ఛార్జ్‌ల సహకారంతోనే చోరీ**

మద్రాస్ రెజిమెంట్‌లో ఆయుధాలు భద్రపరిచే గది వద్ద ఇన్‌ఛార్జితో పాటు వెపన్స్ జారీ చేసే డిపార్ట్‌మెంట్‌కు మరో ఇన్‌ఛార్జి ఉంటారు. వీరిద్దరి సహకారంతోనే రిటైర్డ్ ఆర్మీ అధికారి చోరీకి పాల్పడి ఉంటారని అనుమానిస్తున్నారు. దీనికి సంబంధించి పోలీసులు మాత్రం ఎలాంటి వివరాలను వెల్లడించడం లేదు. మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ ఆర్మీ అధికారులతో కలిసి ఇవాళ సాయంత్రం లేదా రేపు విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించే అవకాశం ఉంది. ఆయుధాల చోరీ కేసులో బొల్లారం, మల్కాజిగిరి పోలీసులు, ఎన్ఐఏ, ఆర్మీ ఇంటెలిజెన్స్ అధికారులు అనేక రకాలుగా గత కొన్ని రోజులుగా దర్యాప్తు చేస్తున్న సంగతి తెలిసిందే.

**కలకలం రేపిన ఆయుధాల చోరీ**

ఆగస్టు 30వ తేదీన సాయంత్రం 6 గంటల నుంచి 31వ తేదీ ఉదయం 7 గంటల మధ్య బొల్లారంలోని మద్రాస్ రెజిమెంట్‌లో జరిగిన ఆయుధాల చోరీ తీవ్ర కలకలం రేపింది. మద్రాస్ రెజిమెంట్‌లోని లెఫ్టినెంట్ కల్నల్ మయాంక్ గోవిటీర్కార్ ఫిర్యాదుతో బొల్లారం పోలీసులు కేసు నమోదు చేశారు. మొత్తం 12 తుపాకులు, 21 మ్యాగజైన్లు, నైట్ విజన్ బైనాక్యులర్‌తో పాటు 1,912 బుల్లెట్లు చోరీకి గురవడంతో విచారణ సంస్థలు రంగంలోకి దిగాయి. 10 రోజుల తర్వాత ఎట్టకేలకు చోరీ అయిన ఆయుధాలను స్వాధీనం చేసుకున్న అధికారులు, ఓ అధికారితో పాటు మరో ఇద్దరిని విచారిస్తున్నారు. వీరి విచారణ పూర్తైతే మరిన్ని విషయాలు తెలిసే అవకాశం ఉంది.

# తిరుమలలో పోటెత్తిన భక్తులు 13వ తేదీన వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు



తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి సన్నిధిలో భక్తుల రద్దీ అనూహ్యంగా పెరిగింది. శ్రీవారి సర్వదర్శనానికి 24 గంటల సమయం పడుతోంది. ఈ నెల 12వ తేదీ నుంచి వరుస సెలవులు వస్తుండటంతో భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తూ తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కీలక నిర్ణయం తీసుకుంది. రద్దీ దృష్ట్యా ఆదివారం (13వ తేదీ) వీఐపీ బ్రేక్ దర్శనాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. మరోవైపు, శ్రీవారి హుండీ ఆదాయం రికార్డు స్థాయిలో నమోదైంది.సామాన్యులకే టీటీడీ పెద్దపీట ప్రస్తుతం తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. స్వామివారి ఉచిత సర్వదర్శనం కోసం భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు. ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు వరుస సెలవులు రానున్నాయి. దీంతో రద్దీ మరింత తీవ్రం కానుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, సామాన్య భక్తులకు త్వరితగతిన స్వామివారి దర్శనం కల్పించేందుకు టీటీడీ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా 13వ తేదీ (ఆదివారం) వీఐపీ బ్రేక్ దర్శనాలను పూర్తిగా రద్దు చేస్తున్నట్లు టీటీడీ అధికారికంగా ప్రకటించింది.సిఫార్సు లేఖల స్వీకరణ నిలిపివేత ఆదివారం వీఐపీ బ్రేక్ దర్శనాలకు వెచ్చించే సమయాన్ని పూర్తిగా సామాన్య భక్తులకే కేటాయించనున్నారు. తద్వారా సామాన్యులకు మరింత త్వరగా స్వామివారి దర్శనభాగ్యం కలగనుంది. ఆదివారం బ్రేక్ దర్శనాలు లేనందున, శనివారం రోజున ఎలాంటి సిఫార్సు లేఖలను స్వీకరించబోమని టీటీడీ స్పష్టం చేసింది. భక్తుల సౌకర్యార్థం తీసుకున్న ఈ నిర్ణయాన్ని వీఐపీలు అర్థం చేసుకోవాలని కోరింది. ప్రతి ఒక్కరూ టీటీడీకి సహకరించాలని ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేసింది.ఆల్ టైమ్ రికార్డ్ మరోవైపు తిరుమల శ్రీవారికి గురువారం రికార్డు స్థాయిలో హుండీ ఆదాయం లభించింది. రూ.6.93 కోట్ల కానుకలు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. బుధవారం ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు భక్తులు సమర్పించిన కానుకలను గురువారం లెక్కించారు. టీటీడీ చరిత్రలో ఒక్కరోజులో రూ.6 కోట్లకు పైగా హుండీ ఆదాయం రావడం చాలా అరుదు. గతంలో మూడు సార్లు మాత్రమే ఈ స్థాయి రికార్డు నమోదైంది. ఇప్పుడు తాజా ఆదాయంతో అది నాలుగోసారిగా రికార్డులకెక్కింది. కొందరు అజ్ఞాత భక్తులు భారీగా నగదు, కానుకలు హుండీలో సమర్పించడంతోనే ఈ స్థాయిలో రికార్డు ఆదాయం నమోదైనట్లు తెలుస్తోంది.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com